FOR ADS......
ఆకాంక్ష
CONTACT: 8333818121

తొలి ఆకాంక్ష
తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

విలేకరులు కావలెను
ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..
సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
తొలి ఆకాంక్ష akankshanews.com

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :190 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజిలు : 08, వెల. 5రూ/ సోమవారం- 02 - మార్చి - 2026

# భారతీయులు ఉన్న ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ దాడి




హార్ముజ్ జలసంధి మీదుగా వెళుతున్న ఓ ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ తాజాగా దాడి చేసింది.

దాడి సమయంలో నౌకలో 15 మంది భారతీయ సిబ్బంది ఉన్నట్టు ఒమాన్ తెలిపింది.

నౌక సిబ్బంది అందరినీ సురక్షిత ప్రాంతానికి తరలించామని పేర్కొంది.

ఢిల్లీ : అమెరికా, ఇజ్రాయెల్‌లు ముప్పేట దాడి చేస్తున్న సమయంలో ఇరాన్ కూడా ప్రతీకార దాడులు చేస్తోంది. హార్ముజ్ జలసంధి మీదుగా ప్రయాణిస్తున్న మిగతా..2లో

# హైదరాబాదులో డ్రంక్ అండ్ డ్రైవ్... వందల సంఖ్యలో దొరికిపోయారు!



వారాంతపు స్పెషల్ డ్రైవ్‌లో 787 మంది మందుబాబులు పట్టివేత

హైదరాబాద్ లిమిట్స్‌లో 506, సైబరాబాద్‌లో 281 కేసులు నమోదు

పట్టుబడిన వారిలో అత్యధికంగా బైక్ రైడర్లే ఉన్నట్టు వెల్లడి

ప్రమాదాలకు కారణమైతే భారతీయ న్యాయ సంహిత కింద పదేళ్ల జైలు

హైదరాబాద్: రోడ్డు భద్రతే లక్ష్యంగా హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో వారాంతంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో భారీ సంఖ్యలో మందుబాబులు పట్టుబడ్డారు. ఫిబ్రవరి 27, 28 తేదీల్లో చేపట్టిన ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న మొత్తం 787 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 506 మంది పట్టుబడగా.. ఇందులో అత్యధికంగా 401 మంది ద్విచక్ర వాహనదారులే ఉండటం గమనార్హం. మిగతా..2లో

## రాజకీయ విమర్శలు మానుకొని.. అభివృద్ధిపై దృష్టి పెట్టండి




- రాజకీయ విమర్శలు మానుకొని, కేంద్రం, రాష్ట్రం నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి జరిగేలా చూడాలన్నారు.
- గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని,

సిద్దిపేట: కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో భాజపా మెజార్టీ సీట్లు గెలిచినా, మేయర్ పదవి రాకుండా అడ్డుకునేందుకు విఫలయత్నం చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇప్పటికైనా రాజకీయ విమర్శలు మానుకొని, కేంద్రం, రాష్ట్రం నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి జరిగేలా చూడాలన్నారు.

## గల్ఫ్ దేశాల్లోని తెలుగు వారికి

# సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచన

ఇరాన్‌తో పాటు గల్ఫ్ ప్రాంతాల్లో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా అక్కడ నివసిస్తున్న తెలుగు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. వివరాల్లోకి వెళితే..

విదేశాల్లో ఉన్న తెలుగు వారి క్షేమ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని,

భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను ఎప్పటికప్పుడు పాటించాలి.



హైదరాబాద్: ఇరాన్‌తో పాటు గల్ఫ్ ప్రాంతాల్లో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా అక్కడ నివసిస్తున్న తెలుగు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. విదేశాల్లో ఉన్న తెలుగు వారి క్షేమ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, అవసరమైతే వారికి తగిన సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. గల్ఫ్ ప్రాంతంలోని తెలుగు అసోసియేషన్లతో నిరంతరం సంప్రదింపులు జరపాలని అధికారులకు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 'ఇరాన్‌తో పాటు గల్ఫ్ ప్రాంతాల్లో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఆయా దేశాల్లో ఉన్న తెలుగు వారు.. భారత రాయబార కార్యాలయాలు మిగతా..2లో

## రాజకీయాల్లో భాష మారాలి.. వెంకయ్య నాయుడు కీలక వ్యాఖ్యలు

- దేశవ్యాప్తంగా అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలు జరగటం సంతోషకరమని భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు.
- 'అటల్‌జీకి అక్షర నిరాజనం' కవితా సంకలనం పుస్తకం ఆవిష్కరించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.



ఖమ్మం జిల్లా, మార్చి 1: దేశవ్యాప్తంగా అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలు జరగటం సంతోషకరమని భారత మాజీ ఉప రాష్ట్ర పతి వెంకయ్య నాయుడు వవ వ్యాఖ్యానించారు. 'అటల్‌జీకి అక్షర నిరాజనం' కవితా సంకలనం పుస్తకం ఆవిష్కరించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తనకు పితృసామానులైన వాజ్‌పేయికి నివాళులర్పించడం తన బాధ్యత అని తెలిపారు. మిగతా..2లో

## ఖమేనీ మరణంతో విషాదంలో యూపీ, కర్ణాటకలోని ఊర్లు




- ఆ గ్రామాలతో సుప్రీం లీడర్ కు కనెక్షన్ ఏంటి
- ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణం
- ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న దేశంలోని కొన్ని గ్రామాల ప్రజలు

## మమతా బెనర్జీ నుంచి బంగాల్ ను

# విముక్తి చేయడమే మా లక్ష్యం

- అక్రమ చొరబాటుదారులకు అండగా మమతా బెనర్జీ
- ఆమె అవినీతిమయ టీఎంసీ ప్రభుత్వం నుంచి బంగాల్ కు విముక్తి కల్పించడమే మా లక్ష్యం
- బీజేపీ చీఫ్ నతిన్ నబీన్ కీలక వ్యాఖ్యలు




ఢిల్లీ : అవినీతిలో కూరుకుపోయిన మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ప్రభుత్వ దుష్పరిపాలన నుంచి బంగాల్ ను విముక్తి చేయాల్సిన అవసరం ఉందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. బంగాల్ ప్రజలు ప్రస్తుతం రాష్ట్రంలో పెను మార్పు కోసం తహతహలాడుతున్నారని, నిజమైన 'పరిబోర్తన్' (మార్పు) కోసం ఆకాంక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఆదివారం కూచ్ బెహార్ లో పార్టీ చేపట్టిన 'పరిబోర్తన్ యాత్ర' ప్రారంభించిన ఆయన, మమతా బెనర్జీ సర్కార్ పై విమర్శలు గుప్పించారు.

### దేశ భద్రతకు ముప్పు!

ఎస్ఐఆర్ చేపట్టి ఓటర్ల జాబితాలోని అక్రమ చొరబాటుదారులను తొలగించే ప్రయత్నం ఎలక్షన్ కమిషన్ చేస్తే, దానిని మమతా బెనర్జీ అడ్డుకునే ప్రయత్నం

# డీఎంకే అధికార స్వప్నాలు పీడకలలుగా మారడం ఖాయం

వచ్చే ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ప్రధాని మోదీ ధీమా



ఢిల్లీ : తమిళనాడులో ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార డీఎంకేపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. తిరిగి అధికారంలోకి వస్తామని చెబుతున్న డీఎంకేకు అది పీడకలగానే మిగిలిపోతుందని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మధురైలో నిర్వహించిన ఎన్ డీఏ ర్యాలీలో ఆయన ప్రసంగించారు. తమిళనాడులోని మహిళలు కష్టాల్లో చిక్కుకుపోయారు. రాష్ట్రంలో రోజురోజుకూ క్రైమ్ పెరిగిపోతుంది. ఆల్కహాల్, డ్రగ్ మాఫియాతో తమ కుటుంబాలు నాశనం అవ్వడాన్ని వారుకల్లారా చూస్తున్నారు. అమ్మ జయలలిత పాలనలో ఎంత మెరుగ్గా జీవించామో అని వారు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారు. అయితే, ప్రతీ ఒక్క తమిళ తల్లి, సోదరి, కూతురుకి ఒక మాట ఇస్తున్నాను. ఎన్ డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటగా రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పై దృష్టి పెడతాం. మిగతా..2లో

## అమరావతిలో జ్యుడీషియల్ అకాడమీకి సీజేఐ శంకుస్థాపన




- ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన చేశారు.
- ఆదివారం రాజధాని అమరావతి సమీపంలోని పిచ్చుకలపాలెం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

అమరావతి, మార్చి 01: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన చేశారు. ఆదివారం రాజధాని అమరావతి సమీపంలోని పిచ్చుకల పాలెం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు

## అమరావతిలో మరో కీలక ఘట్టం

# ఏపీ జ్యుడీషియల్ అకాడమీకి శంకుస్థాపన

- అమరావతి వేదికగా న్యాయ వ్యవస్థలో మరో కీలక అడుగు
- పిచ్చుకలపాలెం వద్ద ఏపీ జ్యుడీషియల్ అకాడమీకి శంకుస్థాపన
- జ్యుడీషియల్ అకాడమీకి శంకుస్థాపన చేసిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్



అమరావతి : రాష్ట్ర రాజధాని అమరావతి వేదికగా న్యాయ వ్యవస్థలో మరో కీలక అడుగు పడింది. పిచ్చుకలపాలెం వద్ద ఏపీ జ్యుడీషియల్ అకాడమీకి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, పలువురు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొన్నారు. రూ.165 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించే అకాడమీ మొత్తం 2.05 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది. ఇక్కడ ఒకేసారి 120 మంది ట్రైనీ జడ్జిలకు శిక్షణ ఇచ్చేలా రూపకల్పన చేశారు. అకాడమీలో 500 సీట్ల సామర్థ్యంతో అత్యాధునిక ఆడిటోరియంను నిర్మిస్తారు. జీ ప్లస్ 8 అంతస్తులతో భారీ హాస్టల్ బ్లాక్ నిర్మాణం ఉంటుంది. అలాగే అమరావతిలో మిగతా..2లో

## అంగన్వాడీల సంక్షేమానికి కూటమి కట్టుబడి ఉంది




అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు, చిరు ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు.

అమరావతి, మార్చి 01: అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు, చిరు ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చరిత్రలోనే తొలిసారిగా రెండు సార్లు అంగన్వాడీ వేతనాలు పెంచిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వంతోపాటు సీఎం చంద్రబాబు నాయుడికి దక్కుతుందన్నారు. ఆదివారం అమరావతిలో అంగన్‌వాడీ కార్యకర్తలతో హోం మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికల్లో అంగన్వాడీలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి

# సంపాదకీయం

## భారత్ పరిణత ప్రజాస్వామ్యమేనా?

న్యూఢిల్లీలో ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో, పెచ్చరిల్లుతున్న నిరుద్యోగం, అమెరికాభారత్ వాణిజ్య ఒప్పందాన్ని నిరసిస్తూ యువజన కాంగ్రెస్ కార్యకర్తల అర్ధనగ్న ప్రదర్శనకు తీవ్ర ప్రతిస్పందనలు వెల్లువెత్తాయి. ఆగ్రహం, పరిహాసం, నీతి పాఠాలు... ఆ ఘటన చోటుచేసుకున్న కొద్ది నిమిషాలలోనే సామాజిక మధ్యమాలలో ఈ అసంకల్పిత ప్రతిస్పందనలు వ్యక్తమయ్యాయి. ప్రైమ్ టైమ్ టీవీ షోలలో ఆ నిరసన ప్రదర్శన ఉదంతానికి సంబంధించిన వీడియోను మళ్లీ మళ్లీ చూపారు. యాంకర్ల వ్యాఖ్యలు: కాంగ్రెస్ కార్యకర్తల అర్ధనగ్న ప్రదర్శన 'దారితప్పిన నిరసన', 'నివ్వెరపరిచింది', 'కలవరపరుస్తోంది' ఇంకా, 'దేశ ప్రతిష్ఠను మంటగలిపింది' అని కూడా గట్టిగా అన్నారు. నిజానిజాలను తరచి చూద్దాం. యువజన కాంగ్రెస్ కార్యకర్తల నిరసనపై విమర్శనాత్మక ప్రతిస్పందనలు పూర్తిగా న్యాయబద్ధమైనవే. ఒక అంతర్జాతీయ సదస్సు సందర్భంగా అటువంటి నిరసన ప్రదర్శన ఒక పేలవమైన రాజకీయ వ్యక్తీకరణ అని నేను భావిస్తున్నాను. ఇంకా సంతకాలు చేయని భారత్అమెరికా వాణిజ్య ఒప్పందంతో ఆ అంతర్జాతీయ ఏఐ సదస్సుకు ఎలాంటి సంబంధం లేదు. అయినా కాంగ్రెస్ కారకర్తలు తమ నిరసనకు అంతర్జాతీయ సదస్సు జరుగుతున్న ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నారు. మీరు ఆ నిర్ణయంతో ఏకీభవించవచ్చు లేదా ఏకీభవించకపోవచ్చు. ప్రజాస్వామిక చర్చ కచ్చితంగా అటువంటి అభిప్రాయభేదాలపైనే ఆరంభమతుంది. ప్రతి నిరసన వివేకవంతమయింది కాదు. ప్రతి నినాదం ప్రతి ఒక్కరినీ ఒప్పించలేదు. యువజన కాంగ్రెస్ కార్యకర్తల అర్ధనగ్న ప్రదర్శన వలే ప్రతి నిరసన కూడా మీడియా దృష్టిని తమపై కేంద్రీకరింప చేసుకునే లక్ష్యంతోనే నిర్వహించడం కద్దు. మీరు ఒక నిరసన ప్రదర్శనను ఏవగించుకోవచ్చు. అయితే శాంతియుతంగా నిరసన తెలిపే హక్కుకు చట్టబద్ధత లేకుండా చేయడం అంగీకరించాల్సిన విషయం కాదు. శాంతియుతంగా నిరసన తెలిపిన యువజన కాంగ్రెస్ కార్యకర్తలను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ కాంగ్రెస్ విభాగం అధ్యక్షుడిని బెయిల్ మంజూరుకు ఆమోదయోగ్యంకాని న్యాయ నిబంధనల కింద అరెస్ట్ చేశారు. 'జాతికి వ్యతిరేకంగా 'కుట్ర' చేశారని కూడా యువజన కాంగ్రెస్ కార్యకర్తలపై అభియోగాలు మోపారు. ఇది నిరసన ప్రదర్శనలపై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నది. ఆసక్తికరమైన విషయమేమిటంటే ఢిల్లీ పోలీసులు గుజరాత్ పోలీసులు పరిపూర్ణత నిచ్చిన నిబంధనలనే అనుసరించి యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్ట్ చేశారు. ఎటువంటి బహిరంగ సమావేశాలనైనా అడ్డుకునేందుకై గుజరాత్ పోలీసులు తరచూ నిరంతరాయంగా సెక్షన్ 144ను అమలుపరిచేవారు. పోలీసులు ఆ సెక్షన్‌ను అలా అమలుపరచడం న్యాయ సమ్మతం కాదని, పౌరుల హక్కులపై రాజ్యాంగ విరుద్ధంగా ఆంక్షలు విధించడమేనని గుజరాత్ హైకోర్టు గత ఏడాది ఒక తీర్పులో స్పష్టం చేసింది. ఒక విధంగా మోదీషాల ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న గుజరాత్ రాజ్యాధికార నమూనా జాతీయ స్థాయికి చేరుకున్నది. ఇప్పుడు దీనిని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు (బీజేపీయేతర పార్టీల ప్రభుత్వాలు కూడా) అమలుపరుస్తున్నాయి. తమ రాజకీయ ప్రత్యర్థులకు ఇబ్బందులు సృష్టించేందుకు స్థానిక పోలీసులను నిస్సిగ్గుగా ఉపయోగించుకోవడం సాధారణమైపోయింది. భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణను సహించలేకనే ఇటువంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నారు. ఇది ప్రమాదకరమైన ధోరణి. ప్రజా జీవితంలో ప్రజాస్వామిక అవకాశాలు సన్నగిల్లిపోతున్నాయి. పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడు వివాదాస్పద అంశాలపై మాట్లాడకుండా పాలకపక్ష సభ్యులు అడ్డుకుంటున్నారు. ప్రజాస్వామిక చర్చకు ఇదెలా దోహదం చేస్తుంది? పార్లమెంటులో చట్టాలపై ఎలాంటి చర్చ లేకుండానే వాటిని ఆమోదింప జేసుకోవడంలో పాలకపక్షం ఆరితేరిపోయింది. అధికారంలో ఉన్నవారికి ఇబ్బంది కలిగించే ప్రశ్నలు సంధించేందుకు ప్రధాన స్రవంతి మీడియా సంకోచిస్తోంది. విశ్వవిద్యాలయాలలో ప్రత్యామ్నాయ అభిప్రాయాలను వ్యక్తం చేసేవారిని 'జాతివ్యతిరేకులు'గా ముద్ర వేస్తున్నారు. పౌర సమాజం కూడా అధికారంలో ఉన్నవారిని సవాల్ చేసేందుకు సాహసించలేకపోతోంది. తాము నిర్వహిస్తోన్న ఓ కార్యక్రమంలో ప్రసంగించేందుకు నటుడు నసీరుద్దీన్ షాను ముంబై విశ్వవిద్యాలయం ఆహ్వానించింది. తీరా ప్రసంగించాల్సిన రోజు సమీపిస్తుండగా ఎటువంటి వివరణ ఇవ్వకుండానే ఆ ఆహ్వానాన్ని రద్దు చేసింది. మోదీ సర్కార్‌ను విమర్శిస్తుండడమే నసీరుద్దీన్ షా చేసిన అపరాధం! యూట్యూబర్లు, స్టాండప్ కమెడియన్లు తదితరులు కూడా అధికారంలో ఉన్నవారికి భయపడుతున్నారు. సర్వత్రా భయం రాజ్యమేలుతోంది. ఇబ్బందికరమైన వాస్తవాలనే కాకుండా తప్పుడు విషయాలనూ అతిగా మాట్లాడేందుకు అనుమతించి రక్షణ కల్పించే వ్యవస్థే ప్రజాస్వామ్యం. మనం ఆమోదించే నిరసన ప్రదర్శనల పట్ల ఎలా వ్యవహరిస్తున్నామన్నది కాకుండా మనకు ఆగ్రహం కలిగించే అసంబద్ధ నిరసనలకు ఎలా ప్రతిస్పందిస్తున్నామన్నదే ప్రజాస్వామిక పరిణతికి గీటురాయి. అయితే పాలకుల ప్రవృత్తి ఇందుకు విరుద్ధంగా ఉంటున్నది. బెయిల్‌కు అవకాశంలేని ఆరోపణలనేవి తీవ్ర నేరాలకు పాల్పడినవారిపై మోపడానికి మాత్రమే ఉద్దేశించినవి. అంతేగానీ శాంతియుతంగా భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న వారిని కట్టడి చేసేందుకు వారిపై అటువంటి ఆరోపణలు మోపకూడదు. అటువంటి చర్య అరెస్టయినవారినే కాకుండా ఇంకా చాలా మందిని ప్రభావితం చేస్తుంది. అందులోని సంకేతం సూక్ష్మమైనదేకానీ శక్తిమంతమైనది: నిరసన తెలిపితే భారీ మూల్యం చెల్లించడం అనివార్యమవుతుంది. భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణను అరాచకంగా భావించకూడదు. అలా భావించడం ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. ప్రజాస్వామ్య వ్యవస్థలు ప్రజా సార్వభౌమాధికారం, జవాబుదారీతనం ప్రాతిపదికన నిర్మితమవుతాయి.

# మానవ అక్రమ రవాణాపై ఏఐ నిఘా




అధునాతన రవాణా, కమ్యూనికేషన్ సాంకేతికతలు, సౌకర్యాలతో ప్రపంచ దేశాలు దగ్గరైపోయాయి. ప్రయాణాలు తేలికయ్యాయి. సంభాషణలు సులభమయ్యాయి. ఇదే అదనుగా మహిళలను వ్యభిచారం కోసం, బాలలను వెట్టిచాకిరీ కోసం, పేదలను నిర్బంధ శ్రమ కోసం అక్రమంగా దేశాల సరిహద్దులు దాటించే ముఠాలు చెలరేగిపోతున్నాయి. అవయవాల అక్రమ వ్యాపారమూ

వాటికి తోడైంది. ఈ క్రమంలో సరిగ్గా వాడుకుంటే నేరగాళ్ల వేటలో కృత్రిమ మేధ మెరుగైన అస్త్రమవుతుంది.

జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక ప్రకారం 2023లో నమోదైన మానవ అక్రమ రవాణా కేసులు 2,183 కాగా, 6,288 మందిని బాధితులుగా గుర్తించారు. వీరిలో 42శాతానికి పైగా మైనర్లున్నారు. 2018-2022 మధ్య కాలంలో నమోదైన 10,659 కేసుల్లో 26,840 మందిని అరెస్టు చేసినా, 1,031 మందికే శిక్ష పడింది. 2025లో సుమారు 2,227 మానవ అక్రమ రవాణా కేసులు నమోదు అయ్యి ఉండొచ్చని అంచనా. మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిశా, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, ఆంధ్రప్రదేశ్‌లలో ఈ నేరాలు ఎక్కువగా వెలుగు చూడవచ్చునని భావిస్తున్నారు. అక్రమ రవాణాదారులు తమ కార్యకలాపాలకోసం సామాజిక మాధ్యమాలను, డిజిటల్ చెల్లింపు వ్యవస్థలనూ, ఇతర ఆన్‌లైన్ వేదికలను వాడుకుంటున్నారు. దీంతో నేరగాళ్ల కట్టడికి కృత్రిమ మేధ(ఏఐ)ను ఆయుధంగా ఉపయోగించాల్సిన అవసరం ఉంది. ఏఐ సాయంతో రియల్‌టైమ్ అనాలిసిస్ ద్వారా నేరాలు, బాధితులు, నేరస్థుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందుకుంటూ తక్షణ చర్యలు తీసుకోవచ్చు. సమాచారం(డేటా)లో పరస్పర పొంతన, క్రమానుగతి ఉన్న అంశాలను వేగంగా గుర్తించడం (ప్యాటర్న్ రికగ్నిషన్) ద్వారా నేరాలను ముందుగానే పసిగట్టడం వల్ల నేరగాళ్ల పనిపట్టడం వీలవుతుంది. ఏఐ అందించే మెషీన్ లెర్నింగ్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, బయోమెట్రిక్ సామర్థ్యాలు నేర నిరోధానికి అమోఘ అస్త్రాలవుతాయి. అయితే, ఏఐ తెస్తున్న మార్పులను అందుకుని చర్యలు తీసుకునే స్థాయికి మన చట్టాలు ఇంకా చేరుకోలేదు. ఫలితంగా చట్టం అమలులో ఏఐ దుర్వినియోగమయ్యే ప్రమాదమూ లేకపోలేదు.

### ముందే పసిగట్టేందుకు...

ఆన్‌లైన్‌లో నేరగాళ్ల కదలికలు, సంభాషణలను, పరస్పరం పంపుకొనే సందేశాలను నిశితంగా గమనిస్తే వారు చేయబోయే నేరాలను ముందే పసిగట్టవచ్చు. సీసీటీవీ కెమేరాలు నేరగాళ్లపై నిఘా పెట్టడానికి వీలు కల్పిస్తున్నాయి. ఏఐ సాయంతో ఇలాంటి సమాచారాన్ని ఒడిసిపట్టి విశ్లేషించడాన్ని ప్రెడిక్టివ్ ఎనలిటిక్స్‌గా వ్యవహరిస్తారు. ఆన్‌లైన్‌లో జరిగే సంభాషణల్లో అనుమానాస్పదమైన వాటిని వెంటనే గుర్తించడానికి ఏఐ ఉపకరిస్తుంది. అక్రమ రవాణాదారులు తరచూ ఉపయోగించే ఆన్‌లైన్ వేదికలు, వెబ్‌సైట్లు, సామాజిక మాధ్యమాలపై ఏఐ సాయంతో నిరంతర నిఘా వేయవచ్చు. డార్క్‌వెబ్‌లో నేరగాళ్ల మధ్య సంభాషణలను ఆలకించి, వారి గూడుపుఠాణిలను ముందే పసిగట్టి నివారించడానికి ఏఐ తోడ్పడుతుంది. కొన్ని సాంకేతికతలు లక్షలాది ఆన్‌లైన్ ప్రకటనలను చిటికెలో స్కాన్ చేయగలవు. ప్రకటనల్లోని భాషలో అనుమానాస్పద అంశాలను, చిత్రాలను ముఖగుర్తింపు సాధనాలతో ఆరాతీసి అధికారులను హెచ్చరించగలవు. మానవ అక్రమ రవాణా ముఠాల చేతికి చిక్కి అదృశ్యమైనవారు ఎక్కడైనా తారసపడితే ముఖగుర్తింపు సాంకేతికతతో వెంటనే కనిపెట్టవచ్చు. అలాగే రికార్డులకెక్కిన నేరగాళ్లను కనిపెట్టడానికీ ఇది తోడ్పడుతుంది. రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లలో సీసీటీవీ కెమేరాల సాయంతో అక్రమ రవాణాదారులనూ, వారి చేతచిక్కిన అభాగ్యులను ముఖగుర్తింపు టూల్స్‌తో గుర్తుపట్టి అడ్డుకోవచ్చు. రవాణా కేంద్రాల దగ్గర కాగ్నిటివ్ బయోమెట్రిక్స్‌ను ఏర్పాటు చేస్తే ముఖకవళికలు, శారీరక భాషల పరిశీలన ద్వారా గుర్తించవచ్చు. తద్వారా బాధితులనూ పసిగట్టవచ్చు. వారి వెంట ఉండే నేరగాళ్లను పోలీసు రికార్డుల్లోని సమాచారం ఆధారంగా గుర్తించవచ్చు. ఈ ప్రక్రియను రైల్వే స్టేషన్లలో నెలకొల్పాలనే ప్రతిపాదన వచ్చింది. మానవ అక్రమ రవాణా పెద్దయెత్తున జరుగుతున్న మహారాష్ట్ర, తెలుగు రాష్ట్రాలు, ఉత్తర్ ప్రదేశ్, ఒడిశా, బిహార్ రైల్వే స్టేషన్లలో ఇందుకు శ్రీకారం చుట్టాలి. దీనికి కావాల్సిన సాంకేతికతలు, పరికరాలను ఐబీఎం, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు అందిస్తున్నాయి. ఏఐ ఆధారిత అనువాద సాధనాలు, చాట్‌బాట్స్ బాధితులకు అధికారులను సంప్రదించే అవకాశాన్ని ఇస్తాయి. నేరగాళ్ల నుంచి తప్పించుకుని సురక్షిత స్థలాలకు చేరుకోవడానికీ, చట్టపరమైన సాయం పొందడానికి తోడ్పడతాయి. వారికి ఆన్‌లైన్‌లో, ఫోన్‌లో మానసిక అండనూ ఇస్తాయి. ఏఐ సాయంతో నేరగాళ్ల ఆట కట్టించడానికి, బాధితులను ఆదుకోవడానికి బిహార్ పోలీసు బలగాలు 'ఆపరేషన్ నయా సవేరా', రైల్వే భద్రతా దళం 'ఆపరేషన్ నన్హే ఫరిష్తే'లను చేపట్టాయి.

### బాధ్యతాయుతంగా వాడుతూ..

మానవ అక్రమ రవాణా నిరోధానికి అమెరికా, కెనడా, ఐరోపా దేశాలు ఉపయోగిస్తున్న టూల్స్‌ను ఇండియాఅందిపుచ్చుకోవాలి. అక్కడి చట్టాల్లోని విలువైన అంశాలను గుర్తించాలి. సర్వశ్రేయస్సుకు ఏఐ అంటూ ఐరాస చేపట్టిన కార్యక్రమం అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహిస్తోంది. అందులో భాగస్వామిగా మారి, చట్టాలకు పదునుపెట్టుకోవాలి. పెండింగులో ఉన్న మానవ అక్రమ రవాణా నిరోధ బిల్లుకు మోక్షం కల్పించాలి. వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దర్యాప్తు సంస్థను ఏర్పాటు చేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలకు కార్యరూపం కల్పించాలి. ఏఐసాయంతో నిఘాను పెంచే క్రమంలో వ్యక్తుల గోప్యతకు భంగం కలుగనీయకూడదు. ముఖగుర్తింపు సాంకేతికతలను దుర్వినియోగం చేయరాదు. డేటా సేకరణలో పక్షపాతం దొర్లకుండా చూడాలి. అక్రమ రవాణాదారులు బాధితులను ఎంచుకోవడానికీ, డీప్-ఫేక్స్ ద్వారా బ్లాక్‌మెయిల్ చేయడానికి ఏఐని వాడుతున్నారు, మరోవైపు, అదే ఏఐ సాంకేతికత పోలీసు, భద్రతా సంస్థల నిఘా సామర్థ్యాన్నీ పెంచుతోంది. మానవ అక్రమ రవాణా సవాలును సమర్థంగా ఎదుర్కోవడానికి పోలీసులు, స్వచ్ఛంద సంస్థలకు ఏఐలో నిరంతర శిక్షణ అవసరం. నిధుల కొరత, ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయ లోపం, చట్టపరమైన అడ్డంకులు వంటివి ఉన్నా- వ్యక్తిగత గోప్యతను, మానవ హక్కులను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా ఏఐని ఉపయోగించి, నేరగాళ్లపై పోరులో విజయం సాధించాలి.

# కమ్యూనిస్టుల పునరేకీకరణ తథ్యం!



కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో 2026 ఫిబ్రవరి 24 ఒక చారిత్రాత్మకమైన రోజుగా మిగులుతుంది. ఈ రోజునే సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ కార్యదర్శిగా ఉన్న తిప్పిరి తిరుపతి (దేవుజీ), మల్లా రాజిరెడ్డి, సుజాతక్క, నూనె నరసింహారెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దామోదర్ (బడే చొక్కారావ్) తదితరులు ఆయుధాలు విసర్జించి లొంగిపోవడంతో దేశంలో ఐదు దశాబ్దాల పైగా ఉనికిలో ఉన్న నక్సలైట్ ఉద్యమం దాదాపు అంతరించినట్లయింది. మావోయిస్టులు దశాబ్దాల తరబడి అనేక కష్టనష్టాలు భరించారు. ప్రాణాలను సైతం తృణప్రాయంగా భావించారు.. తాము నమ్మిన సిద్ధాంతాల కోసం కృషి చేశారు. అయితే దశాబ్దాల అనుభవాలనుండి తాము అను సరిస్తున్న విధానం వల్ల ఫలితాలు రావని గమనించి బయటకు వస్తున్నారు.. వారి త్యాగాలను వృధా కాని వ్వవద్దు. వారిని స్వాగతిద్దాం. ఆదరిద్దాం. గౌరవిద్దాం.. త్యాగపూరిత జీవితాలు కలిగిన ఈ నాయకులు ప్రజల మధ్యలో ఉండి, ప్రజలను చైతన్యపరిచి రాష్ట్రంలో వామపక్ష ప్రత్యామ్నాయాన్ని పటిష్ట పరచటానికి తోడ్పడతారని ఆశిద్దాం.

### జాప్యం తోటే అధిక నష్టాలు..

మావోయిస్టులు ప్రాణాలు పోతాయని భయపడో లేదా అనారోగ్యం వలననో బయటికి వస్తున్నారనేది సరైనది కాదు.. వారు ఇంతకాలం కొనసాగించిన పోరాటాన్ని కొనసాగించలేమని భావించారు. రాజ్యాంగబద్ధంగా పోరాటాలు అవసరమని తమ పంథాని మార్చుకొని బయటికి రావడం ప్రశంసనీయం.. నిజానికి మావోయిస్టు పార్టీ 2024 ఆగస్టులోనే సాయుధ పోరాటాన్ని విసర్జించి, చట్టబద్ధమైన రాజకీయ కార్యకలాపాలకు సిద్ధపడాలని నిర్ణయించుకున్నది. నెలల తరబడి ఆ పార్టీ అంతరంగికంగా చర్చోప చర్చలు చేసి, తాము ఆయుధాలు సహితం వదిలి బయటకు రావటానికి సిద్ధంగా ఉన్నామని 2025 ఏప్రిల్ లోనే మావోయిస్టు పార్టీ నిర్ణయానికి వచ్చింది. నంబాల కేశవరావు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడే ఈ నిర్ణయం జరిగిందని, ఆ పార్టీలోని కొందరి వ్యతిరేకతతో నిర్ణయాన్ని అమలు జరపటంలో జాప్యం జరిగిందని వారి లేఖల ద్వారా తెలుస్తుంది. దానినే ప్రభుత్వం మంచి అవకాశంగా తీసుకొని మావోయిస్టులతో చర్చలు తిరస్కరించింది.

### ఎన్నో ప్రాణాలు మిగిలేవి?

ప్రభుత్వం అప్పటికే కొనసాగిస్తున్న 'ఆపరేషన్ కగార్'ను ఉధృత పరిచింది. పౌరసంఘాలు, వామ పక్షాలు 'శాంతి చర్చలు' జరిపి సమస్యను పరిష్కరించాలని ఎంతో ప్రయత్నం చేసినా, ప్రభుత్వం మొండిగా నిరాకరించింది. దండకారణ్యం అంతా క్యాంపులు పెట్టడం ద్వారా, ఆధునిక టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా రవాణా సౌకర్యాలని అందుబాటులోకి తెచ్చుకొని అడివినంత జల్లెడ పట్టింది. చివరికి నిరాయుధులుగా దొరికిన వారిని, లొంగిపోయిన మావోయిస్టులను సైతం బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి వేసింది. కేంద్ర ప్రభుత్వం కగార్ ఆపరేషన్ ప్రకటించిన తర్వాత మావోయిస్టు పార్టీ 2025 మే 21న ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుని కోల్పోయింది. ఆ తర్వాత సెంట్రల్ కమిటీ సభ్యులు, ముఖ్య నాయ కులను కోల్పోయింది. దీర్ఘకాలిక సాయుధ పోరాటం ఫలితానివ్వదని అనుభవం నుండి నేర్చుకుని 2025 అక్టోబర్ లోనే సోను, ఆశన్న బయటకు వచ్చారు..

### మల్లోజుల లేఖతోనే స్పష్టమైంది!

మల్లోజుల వేణుగోపాల్ రావు తాను విడుదల చేసిన 22 పేజీల లేఖలో తనకున్న సైద్ధాంతిక విభేదాలను వివరిస్తూ అనేక విషయాలు చెప్పాడు.. ఆయనకి ఎంతో కాలం నుండి పార్టీ విధానాల పట్ల వ్యతిరేకత ఉన్నట్లు, అవి పార్టీలో ఎప్పటికప్పుడు చర్చకు పెడుతున్నట్టు అర్థం అవుతుంది. అదే విధంగా తక్కలపల్లి వాసుదేవరావు తాను సుదీర్ఘంగా ఇచ్చిన వీడియోలో దీర్ఘ కాలిక సాయుధ పోరాటానికి దేశ పరిస్థితులు అనుకూలంగా లేవని, మారిన పరిస్థితులను అనుసరించి ప్రస్తుత పంథాను మార్చుకోవాలని, ప్రజల మధ్యలో ఉంటూ ఎన్నికల్లో సైతం పాల్గొనాలని చెప్పారు.. దాదాపు ఇలాంటి అభిప్రాయాలనే తర్వాత ఆయుధాలు విసర్జించి బయటకు వచ్చినవారు చెప్తున్నారు..

### వారి త్యాగాలను నిందించకండి..!

సాయుధ పోరాట సమర్థకులుగా ఉన్నామనుకొనే కొంతమంది ఆ విధానం సరిపడక బయటికి వచ్చిన వారిని ద్రోహులుగా ముద్రలు వేసి అవమానపరుస్తూ ప్రచారం చేశారు.. ఈ పరిస్థితి ఎందుకొచ్చిందో ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన దాని బదులు వారిని విమర్శించటం పరిస్థితిని సంక్లిష్టం చేసింది. దశాబ్దాల తరబడి అజ్ఞాతంలో ఉండి బయటకు వస్తున్న వారిని నిందించటం విజ్ఞత అనిపించుకోదు. ఏ అనివార్యమైన పరిస్థితుల్లో బయటికి వస్తున్నారో అర్థం చేసుకోవాలి.. వారి గౌరవానికి భంగం కలిగించే ఏ పని చేయొద్దు. కమ్యూనిస్టు వ్యతిరేక శక్తుల్లాగా వారిని ద్రోహులని, ప్రజా వ్యతిరేకులని ముద్రలు వేయడం అన్యాయం. బాధ్యతారాహిత్యం. 100 సంవత్సరాల క్రితం పుట్టిన సనాతన సిద్ధాంతం కలిగిన ఆర్ఎస్ఎస్ ఈరోజు అధికారంలోకి రాగలిగింది, కానీ దేశ పురోగతి కోసం, సమాజాభివృద్ధి కోసం, పేద ప్రజల సంక్షేమం కొరకు నాడే పుట్టిన కమ్యూనిస్టు ఉద్యమం బలహీన పడిపోవటం అభిమానులందరిని కలవరపరుస్తుంది. అందుకే చిన్న చిన్న భిన్నాభిప్రాయాలతో చీలిక పేలికలైన కమ్యూనిస్టులందరూ కలవాలని ఒకే గొడుకు కిందికి రావాలని ప్రజలు కోరుకుంటున్నారు.. తక్షణమే కమ్యూనిస్టుల పునరేకీకరణ జరగకపోయినా ఒక కూటమిగా నైనా ఏర్పడాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఇప్పుడు బయటకు వచ్చిన మావోయిస్టులందరూ కూడా ఈ విషయాలను సీరియస్‌గా ఆలోచించాలి.. వేలాదిమంది దశాబ్దాల తరబడి చేసిన త్యాగాలు వృధా కాకూడదు. ప్రజలు కోరుకుంటున్న వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటులో మావోయిస్టులు కీలకపాత్ర వహిస్తారని ఆశిద్దాం.

# గురుకులాల ఘోష!



నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో పురుగుల అన్నం పెడుతున్నారని.. ఇబ్బంది పడుతూ ఈ విషయాన్ని ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్తే కూడా పట్టించుకోకపోగా విద్యార్థులను బెదిరించడంతో విద్యార్థినీలంతా కలిసి ఇటీవల హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా జూకల్ ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదని.. పురుగుల అన్నం, కుళ్లిపోయిన కూరగాయలతో వంట చేస్తున్నారని విద్యార్థులంతా అన్నం కంచాలతో నిజాంపేట-బీదర్ జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై నిరసన తెలియజేశారు. ఇలా బడిలో పాఠాలు చదువుకోవాల్సిన పిల్లలు రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన దుస్థితి నెలకొన్నది. రెండేండ్లుగా గురుకులాల పిల్లలు అయితే దవాఖానపాలు.. లేదంటే రోడ్డుపాలు అన్నట్టుగా తయారైంది. కేసీఆర్ హయాంలో గురుకులాలంటే ఇంగ్లీష్ మీడియం చదువు, జాతీయస్థాయి క్రీడల్లో రాణించే ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా వర్ధిల్లాయి. కానీ నేడు అందులో చదువుకునే విద్యార్థులంతా అర్ధాకలితో అలమటిస్తున్నారు. భావిభారత పౌరులు సచ్చిబతుకుతున్నారు. పేద విద్యారులకు దేవాలయాలుగా భావించే గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లకు కాంగ్రెస్ గ్రహణం పట్టి పీడుస్తున్నది. హాస్టళ్లల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు, విద్యార్థుల ఆత్మహత్యలు, పాముకాటు మరణాలు, పర్యవేక్షణలేక ఇబ్బందులు.. ఇలా ఒక్కటేమిటి సకల సమస్యలతో విద్యారంగం కొట్టుమిట్టాడుతున్నది. రేవంత్ పాలనలో 2 వేలకు పైగా గురుకుల విద్యార్థులు దవాఖాన పాలైనట్టు ప్రభుత్వ లెక్కలే చెప్తున్నాయి. స్వరాష్ట్ర సాధకుడు, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు మంచి తిండి, చక్కటి చదువు అందుతుండేవి. ఎస్సీ గురుకులాల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యావ్యవస్థను దేశానికే ఆదర్శంగా నిలిపారు. తెలంగాణ గురుకులాలు పేదలపాలిట వరంగా రూపుదాల్చాయి. పేదింటి బిడ్డలైన పూర్ణ, ఆనంద్ లాంటి ఎవరెస్ట్ శిఖరాధిరోహకులను అందించిన నిలయాలుగా పేరుగాంచినవి. ఎందరో పిల్లలు ఇంజినీరింగ్, మెడిసిన్‌లో సీట్లు సాధించారు. ప్రఖ్యాత విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందారు. కానీ నేడు గురుకులాల్లో పిల్లలకు ఎప్పుడు ఏం జరుగుతుందో అంతుపట్టని దుస్థితి నెలకొన్నది. పేద విద్యార్థులు చదువుకునే వసతి గృహాలు, గురుకులాలపై రేవంత్ సర్కార్ నిర్లక్ష్యమే ఇందుకు కారణం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పాలకపక్ష పెద్దలు, అధికారులు సంక్షేమ వసతి గృహాలను పర్యవేక్షించడంలేదు. ఫుడ్ పాయిజన్ లాంటి ఘటనలు జరిగినపుడు మాత్రమే హడావుడి చేస్తూ, తర్వాత చోద్యం చూస్తున్నారు.. తూతూ మంత్రంగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థుల సమస్యలు పూర్తిగా గాలికొదిలేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థుల కుటుంబాలు రెక్కాడితే కానీ డొక్కాడనివే. ఇంట్లో గ్రాసం లేకపోయినా పిల్లల చదువు ఆపొద్దనే ఆలోచనతో సర్కార్ మీద నమ్మకంతో సంక్షేమ హాస్టళ్లలో చేర్చే బడుగు జీవులు వాళ్లు. బీఆర్ఎస్ హయాంలో మంచి చదువు, పోషకాహారం అందుతుందనే నమ్మకంతో పిల్లలను తల్లిదండ్రులు హాస్టళ్లలో చేర్పించేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి అధ్వాన్నంగా మారింది. 'మేడిపండు చూడ మేలిమై ఉండును.. పొట్టవిప్పి చూడ పురుగులుండు' అన్న తీరుగా సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు దర్శనమిస్తున్నాయి. ఇన్ని దారుణాలు జరుగుతున్నా ప్రభుత్వం చీమ కుట్టినైట్టెనా స్పందించడంలేదు. ఫలితంగా ఎండాకాలమొస్తే నీళ్ల కొరత, వానాకాలమొస్తే పాముల బెడద, చలికాలంలో దోమలతో విద్యార్థులు సావాసం చేస్తున్నారు. సరైన పోషకాహారం, మెరుగైన చదువు అందిస్తే గురుకులాల నుంచి అబ్దుల్ కలాం, అంబేడ్కర్, పూలే కలలను సాకారం చేసే వారసులు తయారవుతారు. కానీ ప్రభుత్వ అసమర్థత కారణంగా విద్యార్థులు తిండిలేక అలమటిస్తున్నారు. గురుకులాల్లో పిల్లల భవితవ్యంపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అటు చదువు మాన్పించలేక, గురుకులాల్లోనే కొనసాగించలేక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాలిలో దీపాలుగా మారిన పిల్లలపై శ్రద్ధ పెట్టాలని తల్లిందండ్రులు వేడుకున్నా పాలక పెద్దలు కనికరించడంలేదు. అందాల పోటీలకు, గ్లోబల్ సమ్మిట్‌ల కోసం అనవసర ఖర్చు చేసిన సొమ్ములో కనీసం సగమైనా పేద విద్యార్థుల కోసం ఖర్చు పెడితే ఎంతో బాగుండేది. 'కూట్లె రాయి తీయలేనోడు పోయి ఏట్ల రాయి తీస్తడట' అన్నట్టు.. వసతి గృహాలనే కాపాడుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వం యంగ్ ఇండియా స్కూళ్లు అంటూ ప్రచారం చేసుకుంటున్నది. ప్రజలు అడుగుతున్నది భిక్ష కాదు. వాళ్ల హక్కులు. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను సర్కార్ పరిష్కరించి, ఆ బిడ్డల ప్రాణాలకు భరోసా కల్పించాలి.

## గూగుల్ ఆఫీస్‌లో మళ్లీ నల్లుల బెడద.. ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్




న్యూయార్క్ నగరం లోని గూగుల్ కార్యాలయం లో మరోసారి నల్లుల బెడద తలెత్తింది. దాంతో ఆ కార్యాలయం తాత్కాలికంగా మూతపడింది. ఉద్యోగులందరూ వర్క్ ఫ్రమ్ హోమ్ చేయాలని కంపెనీ మెయిల్ పెట్టింది. నల్లుల బెడదను పరిష్కించే వరకు ఉద్యోగులు ఆఫీసుకు రావద్దని సూచించింది. మాన్ హట్టన్ చెల్సియా క్యాంపస్‌లోని ఆఫీసులో ఇటీవల నల్లుల బెడద పెరిగిపోయిందని, వాటిని నిర్మూలించేందుకు ఆఫీసును తాత్కాలికంగా మూసివేస్తున్నామని గూగుల్ సంస్థ తెలిపింది. ఈ నెల 19న ఆఫీసును మూసివేసి నల్లుల నివారణకు చర్యలు చేపట్టింది. సోమవారం నుంచి ఆయా ఉద్యోగులు తిరిగి కార్యాలయానికి వచ్చేందుకు అనుమతి ఇచ్చింది. ఉద్యోగులలో ఎవరికైనా దురద లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని కంపెనీ మెయిల్ చేసింది. పనిచేసే ప్రాంతంలో ఎక్కడైనా నల్లులు కనిపిస్తే తెలుపాలని కోరింది. ఆఫీసులో పెద్ద సంఖ్యలో జంతువుల బొమ్మలు ఉంచడం వల్లే నల్లులు వ్యాపించి ఉండవచ్చని కార్యాలయ వర్గాలు భావిస్తున్నాయి. కాగా 2010లో కూడా ఇదేవిధంగా నల్లుల బెడదతో గూగుల్ కార్యాలయం తాత్కాలికంగా మూతపడింది.

## గాలి కాలుష్యంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారా..? గాలిని శుభ్రం చేసే ఈ మొక్కలను ఇంట్లో పెంచుకోండి..!



ప్రపంచం రోజు రోజుకీ అన్ని రంగాల్లోనూ ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో మరో వైపు అంతే వేగంగా కాలుష్యం కూడా పెరిగిపోతోంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం అన్ని దేశాలను కాలుష్య సమస్య ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ముఖ్యంగా గాలి కాలుష్యం రోజు రోజుకీ తీవ్ర రూపం దాలుస్తోంది. దీంతో కాలుష్యభరితమైన గాలిని పీలుస్తున్న ప్రజలు అనేక రకాల వ్యాధులను కొని తెచ్చుకుంటున్నారు. ఒకప్పుడు కేవలం నగరాల్లో మాత్రమే ఉండే కాలుష్యం ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించింది. దీని వల్ల ప్రజలకు అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే కాలుష్యం లేని స్వచ్ఛమైన గాలిని పీల్చుకోవడం కష్టంగా మారింది. అయితే గాలి కాలుష్యాన్ని అరికట్టాలంటే అందుకు మొక్కలను పెంచడం ఒక్కటే మార్గం. ఈ క్రమంలోనే కొన్ని రకాల మొక్కలను ఇంట్లో పెంచడం వల్ల గాలి కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చు. గాలి శుభ్రంగా మారుతుంది. స్వచ్ఛమైన గాలిని పీల్చవచ్చు. దీంతో ఎలాంటి రోగాలు రాకుండా అడ్డుకోవచ్చు.

### బోస్టన్ ఫెర్న్, స్పైడర్ ప్లాంట్..

బోస్టన్ ఫెర్న్ అనేక మొక్కను ఇంట్లో పెంచుకోవచ్చు. ఇది గాలిలో ఉండే ఫార్మాల్డిహైడ్ వంటి కాలుష్య కారకాలను తొలగించి గాలిని శుభ్రం చేస్తుంది. అలాగే గాలిలో ఉండే బెంజీన్, జైలీన్ వంటి సమ్మేళనాలను సైతం నిర్మూలిస్తుంది. ఈ మొక్కను ఇంట్లో పెంచుకోవడం చాలా సులభం. దీనికి వారంలో ఒకసారి నీటిని పోస్తే చాలు, చాలా సులభంగా పెరుగుతుంది. అలాగే స్పైడర్ ప్లాంట్ అనే మొక్కను ఇంట్లో పెంచుకుంటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ఈ మొక్క గాలిలో ఉండే కాలుష్య కారకాలను తొలగించి గాలిని శుభ్రంగా మారుస్తుంది. ఈ మొక్కలను చాలా సులభంగా ఇంట్లో పెంచుకోవచ్చు. వీటి సంరక్షణ కూడా చాలా సులభమే. కిటికీల వద్ద లేదా ఎండ తగిలేలా ఈ మొక్కలను పెంచాల్సి ఉంటుంది. దీంతో ఇవి సులభంగా పెరుగుతాయి.

### వీపింగ్ ఫిగ్, పీస్ లిల్లీ..

వీపింగ్ ఫిగ్ అనే మొక్కను ఇంట్లో పెంచుకుంటున్నా ఉపయోగం ఉంటుంది. ఈ మొక్కలను చక్కగా సంరక్షిస్తే 2 అడుగుల నుంచి 10 అడుగుల ఎత్తు వరకు పెరుగుతాయి. వీటిని కూడా చాలా సులభంగా పెంచవచ్చు. పెద్దగా సమయం కేటాయించాల్సిన పని కూడా ఉండదు. ఇంట్లో లేదా ఇంటి బయట ఈ మొక్కలను పెంచవచ్చు. అయితే సూర్యరశ్మి తగిలేలా ఈ మొక్కలను పెంచాల్సి ఉంటుంది. ఒకసారి ఈ మొక్కకు నీటిని పోస్తే పూర్తిగా తడి ఆరిపోయే వరకు నీటిని పోయాల్సిన పని ఉండదు. అందువల్ల చాలా సులభంగా ఈ మొక్కలు పెరుగుతాయి. ఈ మొక్కలను ఇంట్లో పెంచుకుంటే గాలి శుభ్రంగా మారుతుంది. స్వచ్ఛమైన గాలిని పీల్చవచ్చు. అదేవిధంగా గాలిని శుభ్రం చేయడంలో పీస్ లిల్లీ అనే మొక్క కూడా మేలు చేస్తుంది. ఇది కేవలం గాలిని శుభ్రం చేయడం మాత్రమే కాదు, అందమైన పూలను కూడా పూస్తుంది. ఇవి సువాసనను వెదజల్లుతాయి. గాలిలో ఉండే కాలుష్య కారకాలు, ఆర్గానిక్ సమ్మేళనాలను ఈ మొక్కలు తొలగిస్తాయి. ఈ మొక్కలను చాలా సులభంగా పెంచవచ్చు.

### ఇంగ్లిష్ ఐవీ..

ఇంగ్లిష్ ఐవీ అనే మొక్క కూడా గాలిలో ఉండే కాలుష్య కారకాలను తొలగించి గాలిని శుభ్రంగా మారుస్తుంది. దీన్ని అలంకరణ కోసం కూడా పెంచుకోవచ్చు. కానీ సూర్యరశ్మి తగిలేలా ఈ మొక్కను పెంచాల్సి ఉంటుంది. నీళ్లను తరచూ పోయాల్సిన పని ఉండదు. ఎప్పుడో ఒకసారి నీళ్లను పోసినా చాలు, చాలా సులభంగా ఈ మొక్క పెరుగుతుంది. ఇలా ఆయా రకాల మొక్కలు గాలిని శుభ్రం చేయడంలో ఎంతగానో సహాయం చేస్తాయి. గాలి కాలుష్యాన్ని తొలగిస్తాయి. మనకు స్వచ్ఛమైన గాలిని అందిస్తాయి. శ్వాసకోశ సమస్యలు రాకుండా రక్షిస్తాయి. అయితే కొన్ని రకాల మొక్కలు అలర్జీని కలిగించే స్వభావాన్ని కలిగి ఉంటాయి. కనుక అలర్జీలు ఉన్నవారు లేదా పిల్లలు ఉన్నవారు.

# ఉపన్యాస తోరణం సమాజ దర్పణం



దేవులపల్లి రామానుజరావు ఓ విలక్షణ సాహితీ స్రష్ట. అనేక ఉన్నత పదవులను అలంకరించినా భేషజాలు లేని నిరాడంబర వ్యక్తిత్వం. సారస్వత పరిషత్తును శ్వాసగా చేసుకొని జీవించిన సారస్వత మూర్తి. రామానుజరావు అనేక పుస్తకాలు రాశారు. వాటిలో 'పచ్చ తోరణం', 'నవనీతము', 'నా సాహిత్యోపన్యాసాలు', 'ఉపన్యాస తోరణం' పేరెన్నిక గన్నవి. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన రామానుజరావు మంచి వక్త గూడా. 1979, 80, 81 సంవత్సరాలలో కొన్ని సాహిత్య సభల్లోనూ, ఆకాశవాణిలోనూ వివిధ సంస్థల తరఫున బొంబాయి, నెల్లూరు, విశాఖపట్టణం, కరీంనగర్, హైదరాబాద్ మున్నగు పట్టణాలలో వారు చేసిన ప్రసంగాల సమాహారమే 'ఉపన్యాస తోరణం' అనే పుస్తకం. ఈ పుస్తకంలో 'భారత స్వాతంత్ర్యానికి పూర్వం తెలుగులో పత్రికా రచన, 'స్వర్గీయ చలం', 'నేను గుర్తించిన తిక్కన', 'నేను దర్శించిన పోతన', 'తెలుగులో తొలి సమాజ కవులు', 'అఖిల భారత తెలుగు రచయితల (ఏడవ) మహాసభలు', 'తెలుగులో వెలువడిన స్వీయ చరిత్రలు', 'ఆంధ్రప్రదేశ్‌లో స్వాతంత్ర్యోద్యమము-కొన్ని జ్ఞాపకాలు' అనే ప్రసంగ పాఠాలు పొందుపరచబడి ఉన్నాయి. తెలుగు ప్రజల సామాజిక, సాంస్కృతిక, రాజకీయ జీవితాన్ని ప్రభావితం చేసిన తెలుగు పత్రికలకు, పత్రికా రచనకు వందేండ్ల పైబడిన చరిత్ర ఉంది. సమాజ, దేశ పురోగతిలో అవి నిర్వహించిన పాత్ర అనిర్వచనీయం. స్వాతంత్ర్యానికి పూర్వం తెలుగులో పత్రికా రచన గూర్చి బొంబాయిలో స్వర్గీయ దేశోద్ధారక, కళాప్రపూర్ణ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు స్మారక సభలో 'తెలుగు పత్రికా రచన- దాని వికాసము' అనే అంశంపై మాట్లాడుతూ, తెలుగుదేశాన్ని మేలుకొల్పిన మహనీయులలో వీరేశలింగం ప్రక్కన నిలిచే వ్యక్తి నాగేశ్వరరావు అంటారు రామానుజరావు. సంపాదించినదంతా ప్రజోపయోగ కార్యక్రమాలకు వెచ్చించి, గాంధీ చేత 'విశ్వదాత' అని పేరొందినవాడు. తెలుగు భాషా సంస్కృతులకు ఆ రోజులలో వెన్నెముకగా ఉండి, భాషా సేవ చేసిన మహనీయుడు. అయితే, దేశంలోని అన్ని భాషల్లో వలె తెలుగులో కూడా పత్రికలను స్థాపించి నిర్వహించిన ఘనత క్రైస్తవ మిషనరీలదేనంటారు రామానుజరావు. అందుకేనేమో తెలుగులో అచ్చయిన మొట్టమొదటి పుస్తకం 'బైబిల్'. అయితే పత్రికల ద్వారా ఉత్తేజితులై ప్రజలలో జాతీయ భావాలు, స్వాతంత్ర్య కాంక్షలూ వ్యాప్తి చెందుతాయన్న భయంతో వలస ప్రభుత్వం పత్రికలను నిరుత్సాహపరిచి నీరుగార్చిందంటారు రామానుజరావు. 1902లో క్రిష్ణా డిస్ట్రిక్ట్ అసోసియేషన్ పక్షాన మచిలీపట్నంలో ప్రారంభమైన 'కృష్ణా' పత్రికతో తెలుగు పత్రికారంగంలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన నూతన అధ్యాయం ప్రారంభమైంది. దాసు నారాయణరావు అనే మిత్రునితో కలిసి న్యాయవాది అయిన దేశభక్త కొండా వెంకటప్పయ్య ఈ పత్రిక సంపాదకులు. ఈ పత్రిక వందేమాతరం ఉద్యమాన్ని బలపర్చడమే కాకుండా, రైతుల హక్కుల కోసం పోరాడటం, ప్రభుత్వ అవినీతిని ఎండగట్టడం వంటి చర్యలతో ప్రజాభిమానం చూరగొన్నది. తదనంతరం గొప్ప విద్వాంసుడు, సాహిత్య విమర్శకుడు కళోపాసకుడు అయిన ముట్నూరు కృష్ణారావు సంపాదకత్వంలో ఈ పత్రిక వెలువరించిన స్వాతంత్ర్య భావాలు ప్రజలను ఉత్తేజపరిచినవంటారు. ఎందరో దేశ నాయకులను సృజిస్తూ వెలువడిన ఈ పత్రిక అనతికాలంలోనే యువకులకు, రచయితలకు, కళోపాసకులకు నూతనోత్సాహాన్నిచ్చింది. ఇకపోతే, నిజాం నిరంకుశ పదఘట్టనల కింద నలిగిపోతున్న తెలంగాణ ప్రాంతంలో 1920లో రెండు పత్రికలు వెలువడ్డాయి. ఒకటి వరంగల్ జిల్లా ఇనుగుర్తి గ్రామం నుంచి వెలువడిన 'తెనుగు' పత్రిక, రెండవది నల్లగొండ నుంచి వెలువడిన 'నీలగిరి' పత్రిక. 'తెనుగు' పత్రిక సంపాదకులు ఒద్దిరాజు సీతారామ చంద్రరావు, ఒద్దిరాజు రాఘవ రంగారావు సోదరులు. వీరిద్దరూ తమ బహుముఖ ప్రతిభతో, సంస్కృతాంధ్ర భాషలలోనే గాక, ఉర్దూ, ఇంగ్లీష్, పార్సీ భాషలలో ఆరితేరి ఇంకా ఆయుర్వేద, యునాని వైద్యంలోనూ, సాంకేతిక పరిజ్ఞానంలోనూ తమ ప్రావీణ్యం కనబరిచిన ప్రజ్ఞావంతులం. ఎన్నో ఒడిదుడుకులనెదుర్కొని, జాతీయ భావాలతో, సాహిత్యాభిలాషతో, స్వతంత్ర కాంక్షతో, దేశభక్తితో వీరు వెలువరించిన 'తెనుగు' పత్రికకు ప్రజల్లో మంచి ఆదరణ లభించిందంటారు. 'నీలగిరి' పత్రికకు షబ్నవీస్ నరసింహారావు సంపాదకులు. తెలంగాణను జాగృతం చేయడానికి వెలువడిన మొట్టమొదటి పత్రికలు ఈ రెండు కాగా, తదుపరి హైదరాబాద్ నుంచి సురవరం ప్రతాపరెడ్డి సంపాదకత్వంలో వెలువడిన 'గోలకొండ' పత్రిక విశేష ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. ఆ తర్వాత తెలంగాణలో సుజాత, దీనబంధు, దక్కన్ కేసరి, తెలుగు తల్లి, విభూతి, దివ్యవాణి, తరుణ వంటి అనేక పత్రికలు వెలువడ్డాయని చెప్తూ, 'తెలుగుతల్లి' పత్రికకు రాచమళ్ళ సరస్వతీదేవి అనే విదుషీమణి, దేశభక్తురాలు సంపాదకులుగా పనిచేశారని చెప్పినప్పుడు అప్పటి సామాజిక స్థితిలో స్త్రీలు కూడా ఈ పవిత్ర యజ్ఞంలో పాలు పంచుకున్నారని తెలిసి మనసు గర్వంతో ఉప్పొంగుతుంది. ఇంకా 'భాగ్యనగర్' అనే వారపత్రిక, 'తెలంగాణ', 'మీజాన్' అనే దినపత్రికలు మాత్రమే గాక, 'శోభ' అనే సాహిత్య మాసపత్రిక తెలంగాణ ప్రాంత విద్య, వైజ్ఞానిక భాషా వికాసానికి తమ వంతు పాత్ర పోషించాయని రామానుజరావు మాటల ద్వారా తెలుస్తున్నది. చలం మరణించిన సందర్భంలో ఆకాశవాణి హైదరాబాద్ నుంచి చేసిన ప్రసంగంలో, చలం గురించి రామానుజరావు మాట్లాడిన మాటలు చలాన్ని ఓ గొప్ప సాహితీవేత్తగా చూపడమే కాక చలం ఆదర్శ, విప్లవ, ఆలోచనా పంథాను సమర్థించడం ఇక్కడ గమనార్హం. ముఖ్యంగా, స్త్రీ పక్షపాతి అయిన చలం 'మానవ సమాజంలో స్త్రీలు భాగమే అంటూ, స్త్రీకి మనసుందిబీ స్త్రీకి మేధ ఉందిబీ స్త్రీకి కోరికలున్నాయి, వాటిని పురుష సమాజం గుర్తించాల్సిన అవసరం ఉంద'ం టూ తన రచనల ద్వారా సమాజాన్ని మేల్కొల్పిన చలంను గూర్చి సానుకూల దృక్పథంతో మాట్లాడిన రామానుజరావు మానవీయ కోణం ఈ ప్రసంగంలో సుస్పష్టం. అందుకే చలం సాహిత్యంలో రస సృష్టితో పాటు తాత్వికమైన హేతువాద దృష్టి గోచరిస్తుందని చలం సాహిత్య స్వరూపాన్ని పేర్కొన్న విమర్శకులతో ఏకీభవిస్తారు రామానుజరావు. నెల్లూరులో తిక్కన తిరునాళ్లలో పాల్గొన్నప్పుడు 'నేను గుర్తించిన తిక్కన' అన్న అంశంపై ప్రసంగిస్తూ తిక్కన తమ స్వస్థలం వరంగల్‌కు వచ్చిన సందర్భాన్ని స్మరించుకుంటూ చాలా సంవత్సరాల క్రితం తాను కవిత్వం రాసే రోజుల్లో రాసుకున్న మాటలను..

**'తిక్కనా మాత్యుండు తెలుగు దేశపు రాజు**
**కలసి మాటాడిన కొలువిదేమో'**
**'అల్లుని స్వేచ్ఛకై నెల్లూరి నెరజాణ**
**పరియించెనిచటనే భారతంబు'**

అని ఈ సందర్భంగా ఆత్మీయంగా గుర్తుచేసుకుంటారు రామానుజరావు. నెల్లూరు ప్రాంతాన్ని పరిపాలించిన మనుమసిద్ధికి ముఖ్యమంత్రిగా ఉన్న తిక్కన సోమయాజి ఆయనకు ఆంతరంగికుడు, ఆప్తుడు కూడా. తిక్కన తన 'నిర్వచనోత్తర రామాయణం'ను మనుమసిద్ధికి అంకితమిచ్చాడు. అప్పటికే కాకతీయ రాజులు దాదాపుగా తెలుగు దేశాన్నంతా తమ అధీనంలోకి తీసుకున్నారు. ముఖ్యంగా, కాకతీయ ప్రభువు గణపతి దేవుని పరిపాలన తెలుగు వారిలో జాతీయాభిమానాన్ని పాదుకొల్పింది. ఆయన రాజధాని 'ఏకశిలా నగరం'గా ప్రసిద్ధి పొందింది. ఈ పరిస్థితులలో తిక్కన బయ్యనలు దండయాత్ర గావించి తిరిగి మనుమసిద్ధికి పట్టంగట్టారు. మనుమసిద్ధి రాజ్యాన్ని తిరిగి అతనికి ఇప్పించడానికి సహాయం అర్థిస్తూ తిక్కన సోమయాజి గణపతిదేవుని వద్దకు ఓరుగల్లు వచ్చాడట. ఓరుగల్లులో ఆయనకు బ్రహ్మాండమైన స్వాగతం లభించినట్టు 'సిద్ధేశ్వర చరిత్ర' ద్వారా తెలుస్తుంది. తన జ్ఞాన సంపదతో, వాగ్ధాటితో ఓరుగల్లులో బౌద్ధ పండితులతో చర్చలు గావించి వారిని ఓడించి గణపతి దేవుని ప్రశంసలు పొంది ఆయన సహాయంతో తిరిగి నెల్లూరుకు వచ్చి మనుమసిద్ధిని పట్టాభిషిక్తుని గావిస్తాడట తిక్కన సోమయాజి. ఇదిలా ఉంటే, వేంగీ దేశమును పాలించిన రాజ రాజనరేంద్రుని ఆస్థాన కవి నన్నయ, రాజు ప్రేరణ చేత భారత రచన ప్రారంభించాడు. అయితే సుమారు రెండున్నర పర్వాలు రాసి ఆయన మరణించాడు. తర్వాత ఈ భారతాన్ని రచించడానికి ఎవ్వరూ ముందుకురాలేదు. ఈ బాధ్యతను తిక్కనా మాత్యుడు చేపట్టి విజయవంతంగా పూర్తిచేసి సారస్వత ప్రపంచంలో కవిరాజుగా నిలిచాడని రామానుజరావు వివరిస్తారు. ఇంతటి మహత్తర కార్యాన్ని నిర్వహించిన తిక్కన తనను గూర్చి ఎంత వినయపూర్వకంగా చెప్పుకున్నప్పటికీ ఆనాటి సమాజంలో ఆయనకు లభించిన గౌరవం అపూర్వం అని అభిప్రాయపడుతారు ఉపన్యాసకులు. (ఇంకా ఉంది..)

# అతడు ఉరిని జయించాడు




తెలంగాణ పోరాటాల గడ్డ. నాడు నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం, ఆ తర్వాత భూస్వాములపై జరిగిన శ్రామిక, రైతు పోరాటాలు చరిత్రలో నిలిచాయి. స్వతంత్ర భారతంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం అందరూ చూశారు. ఈ పోరాటాల సమయంలో తెలుగు సాహిత్యం, ముఖ్యంగా తెలంగాణ సాహిత్యం తన ప్రత్యేక పాత్రను పోషించింది. దీన్ని ఎవరూ తిరస్కరించలేరు. స్వరాష్ట్ర సాధనకు కేసీఆర్ చేసిన పోరా టం ఎవరూ మరిచిపోలేరు. ఈ పోరాటాలన్నింటికీ సాహిత్యమే నేపథ్యంలా నిలిచింది. అలాంటి తెలంగాణ గడ్డ మీద ఓ దళిత బహుజనుడి పోరాట గాథ ముందుగా హిందీలో 'ఫాన్సీ' (ఒక బహుజనుడి ఆత్మకథ-1918)గా వచ్చింది. తర్వాత డాక్టర్ కారం శంకర్ చేసిన తెలుగు అనువాదం 'ఉరికంబం నీడలో' కొద్దిరోజుల కిందట ఆవిష్కరించబడింది. ఈ పుస్తకం చాకలి కులానికి చెందిన కె.రాజన్న ఆత్మకథ. ఆదిలాబాద్ జిల్లాలోని ఒక కుగ్రామంలో భూస్వాములు దమనకాండ సాగించడం, మహిళలపై అత్యాచారాలు ఆయన జీవితానికి నేపథ్యంగా ఉన్నాయి. దౌర్జన్యాన్ని సహించలేని రాజన్న తప్పనిసరి పరిస్థితుల్లో కత్తి పట్టాల్సి వచ్చింది. ఆత్మరక్షణ ప్రయత్నంలో ఒక ప్రాణం బలైంది. తర్వాత కోర్టులు, ఉరికంబాలు, యావజ్జీవితాలూ, క్షమాభిక్షతో విడుదల కావడాలూ ఇదీ క్రమానుగతమైన ఘటనల పరంపర. రాజన్న జీవితం నిప్పుల కొలిమిలో కాకలు దీరింది. చాకిరేవుకు వెళ్తున్న సమయంలో తన భార్యతో భూస్వామి అసభ్యంగా ప్రవర్తిస్తాడు. విషయం తెలుసుకున్న రాజన్న దొరను నిలదీస్తాడు. ఇది దొరకు కోపం తెప్పిస్తుంది. రాజన్నపై దాడి చేయాలని నిర్ణయించుకుంటాడు. దొర రాజన్నపై దాడి చేస్తాడు. కానీ, ఆ దాడిలో రాజన్నకు బదులు దొర చనిపోతాడు. ఊరి ప్రజలంతా మొదట రాజన్న చనిపోయాడనుకుంటారు. అంతేకాదు, మొదట ఆ శవంపై పడి రాజన్న భార్య ఏడుస్తుంది కూడా. దీపం వెలుతురులో చూస్తే చచ్చిపడి ఉన్నది దొర అని తెలుస్తుంది. ఆ తర్వాత పోలీసులు, న్యాయస్థానాలూ, జైళ్లు రాజన్నను చుట్టుముట్టాయి. 'ఇతడు ఒక ప్రమాదకరమైన వ్యక్తి. ఇతడు జీవించి ఉండటం ఈ సమాజానికి సురక్షితం కాదు. అందువల్ల ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 302 ప్రకారం ఇతడిని చనిపోయేంతవరకు ఉరితీయాలి' (పేజీ 31) అని జడ్జి తీర్పు చెప్పాడు. ముషీరాబాద్ జైల్లో ఉన్నప్పుడు రాజన్న తండ్రి కొడుకుని ఉరి తీశారనుకొని గుండు గీసుకొని పిండ ప్రదానం చేశాడు. ఉరి తీయటానికి ముందే పెళ్లి చేసుకుంటానని భార్య అంటే రాజన్న ఒప్పుకొన్నాడు. దాంతో ఆమె వేరే పెళ్లి చేసుకుంది. రాజన్న ఉరిశిక్షను హైకోర్టు యావజ్జీవ కారాగార శిక్షగా మార్చింది. ముషీరాబాద్ నుంచి రాజన్న చంచల్‌గూడ జైలుకు మారాడు. అక్కడే చదువు మీద ధ్యాస పెట్టాడు. అంతకుముందు 6వ తరగతి వరకు చదువుకున్న రాజన్న జైల్లో విద్యాభ్యాసం కొనసాగించాడు. 1990లో ఎన్టీఆర్ ప్రభుత్వం రాజన్నకు క్షమాభిక్ష ప్రసాదించింది. విడుదలైన తర్వాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చేసి ఓ ప్రముఖ హిందీ పత్రికలో చేరాడు. మళ్లీ పెండ్లి చేసుకున్నాడు. పిల్లలను చదివించాడు. పెంచి పెద్ద చేశాడు. ఇప్పటికీ రచనా వ్యాసంగం కొనసాగిస్తూనే ఉన్నాడు. ఇదీ క్లుప్తంగా రాజన్న జీవితం. దీన్ని తనకు బాగా అలవాటైన హిందీలో 'ఫాన్సీ' పేరుతో రాశాడు. రాజన్న జీవితం ఆద్యంతం స్ఫూర్తిమంతమైన పోరాటాల మయం. 144 పేజీల పుస్తకంలో 16 ఫొటోలున్నాయి. దీన్ని ఎమెస్కో వారు ప్రచురించారు. ఎమెస్కో సంపాదకులు డాక్టర్ కె.చంద్రశేఖర్ రెడ్డి, నిఖిలేశ్వర్, అల్లం రాజయ్య, యాటకర్ల మల్లేశ్, అనువాదకులు కారం శంకర్ ముందుమాటలు, పుస్తక రచయిత సందేశాలు అందరినీ ఆలోచింపజేస్తాయి. ఒక్క మాటల్లో చెప్పాలంటే ప్రతి ఒక్కరూ చదవాలసిన పుస్తకం.

# మీ చర్మ సౌందర్యానికి అద్భుతంగా పనిచేసే నెయ్యి.. ఎలా ఉపయోగించాలంటే..?



నెయ్యిని మనం తరచూ వంటల్లో ఉపయోగిస్తూనే ఉంటాం. దీన్ని నేరుగా తింటారు లేదా వంటల్లో వేస్తారు. నెయ్యిని కలిపి అన్నంతోపాటు తింటే ఎంతో రుచిగా ఉంటుంది. ఉత్తరాది వారు నెయ్యిని చపాతీలపై రాసి కూడా తింటారు. నెయ్యితో చాలా మంది ఎక్కువగా తీపి వంటకాలను చేస్తుంటారు. అవి ఎంతో రుచిగా ఉంటాయి. అయితే ఆయుర్వేద ప్రకారం నెయ్యి మనకు అనేక లాభాలను అందిస్తుంది. దీన్ని రోజూ తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. నెయ్యిలో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి వ్యాధులు రాకుండా చూస్తాయి. శరీరాన్ని సంరక్షిస్తాయి. అయితే ఆరోగ్యపరంగానే కాక సౌందర్య పరంగా కూడా నెయ్యి మనకు అనేక లాభాలను అందిస్తుంది. నెయ్యిని పలు విధాలుగా ఉపయోగించడం వల్ల చర్మం సురక్షితంగా ఉంటుంది. కాంతివంతంగా మారి మెరుస్తుంది.

### నల్లని వలయాలకు..

కళ్ల కింద ఏర్పడే నల్లని వలయాలను తొలగించేందుకు గాను నెయ్యి అద్భుతంగా పనిచేస్తుంది. ఇందుకు ఏం చేయాలంటే కొద్దిగా నెయ్యిని తీసుకుని రాత్రి పూట నిద్రించే ముందు నల్లని వలయాలపై నెమ్మదిగా రాయాలి. మరుసటి రోజు ఉదయం కడిగేయాలి. అయితే రాత్రి పూట వద్దనుకునేవారు ఉదయం కూడా రాయవచ్చు. రాసిన తరువాత 2 నుంచి 3 గంటలపాటు వేచి ఉండాలి. తరువాత కడిగేయాలి. ఇలా చేస్తుంటే డార్క్ సర్కిల్స్ తొలగిపోతాయి. ముఖం కాంతివంతంగా కనిపిస్తుంది. చలికాలంలో పెదవులు సహజంగానే పగులుతుంటాయి. అయితే కొందరికి ఈ సమస్య ఎల్లప్పుడూ ఉంటుంది. అలాంటి వారు రాత్రి పూట పెదవులకు కొద్దిగా నెయ్యి రాస్తే మేలు జరుగుతుంది. రాత్రి పూట పెదవులకు నెయ్యి రాసి మరుసటి రోజు ఉదయం కడిగేయాలి. ఇలా చేస్తుండడం వల్ల పెదవులు పగలడం తగ్గుతుంది. పెదవులు మృదువుగా మారి కాంతివంతంగా కనిపిస్తాయి. పెదవులు ఆరోగ్యంగా ఉంటాయి.

### శరీరానికి రాస్తే..

స్నానం చేయడానికి ముందు కొద్దిగా నెయ్యిని శరీరానికి లేదా ముఖానికి రాయాలి. కాసేపు అయ్యాక స్నానం చేయాలి. ఇలా చేస్తుంటే చర్మం తేమగా మారి మృదువుగా ఉంటుంది. కాంతివంతంగా మారి మెరుస్తుంది. పొడిబారిన చర్మం ఉన్నవారికి ఈ చిట్కా ఎంతగానో ఉపయోగపడుతుంది. అలాగే కొద్దిగా నెయ్యి తీసుకుని అందులో కాస్త శనగపిండి, పాలు వేసి కలిపి పేస్ట్‌లా చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాయాలి. కాసేపు అయ్యాక కడిగేయాలి. ఇలా చేస్తుండడం వల్ల ముఖంలో కళ పెరుగుతుంది. కాంతివంతంగా మారుతుంది. ముఖంపై ఉండే మొటిమలు, మచ్చలు, ముడతలు తొలగిపోతాయి. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు.

### ముఖ సౌందర్యానికి..

గాయాలు, పుండ్లను తగ్గించేందుకు కూడా నెయ్యి అద్భుతంగా పనిచేస్తుంది. రాత్రి పూట గాయాలు, పుండ్లపై కాస్త నెయ్యి రాసి మరుసటి రోజు ఉదయం కడిగేయాలి. ఇలా చేస్తుంటే అవి త్వరగా మానుతాయి. ఇన్‌ఫెక్షన్ అవకుండా ఉంటాయి. అలాగే నెయ్యిని, తేనెను కలిపి మిశ్రమంగా చేసి ముఖానికి రాయాలి. 20 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. తరచూ ఇలా చేస్తుంటే ముఖంపై ఉండే ముడతలు, మచ్చలు, మొటిమలు తగ్గిపోతాయి. ముఖం కాంతివంతంగా మారుతుంది. యవ్వనంగా కనిపిస్తారు. ఇలా నెయ్యిని ఉపయోగించడం వల్ల చర్మ సౌందర్యాన్ని పెంచుకోవచ్చు. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

## భారత్ ఎగుమతులు పెరిగాయ్- జనవరిలో

## రూ.7.30 లక్షల కోట్ల ఎక్స్‌పోర్ట్స్- వాణిజ్య లోటు డబుల్ కేంద్రం

2026 జనవరిలో 13.16 శాతం పెరిగిన భారత్ ఎగుమతులు- రూ.6.45 లక్షల కోట్ల నుంచి రూ.7.30 లక్షల కోట్లకు జంప్- రూ.48వేల కోట్ల నుంచి రూ.94వేల కోట్లకు పెరిగిన వాణిజ్య లోటు



ఈ ఏడాది జనవరిలోనూ విదేశాలకు భారతదేశ వస్తు, సేవల ఎగుమతులు 13.16 శాతం పెరిగాయి. 2025 జనవరిలో భారత్ రూ.6.45 లక్షల కోట్ల ఎగుమతులు చేయగా, ఈ సంవత్సరం అదే నెలలో రూ.7.30 లక్షల కోట్లు విలువైన ఎగుమతులను సాధించింది. ఇక దిగుమతులు సైతం 18.77 శాతం పెరిగాయి. 2025 జనవరిలో విదేశాల నుంచి భారత్ రూ.6.94 లక్షల కోట్లు విలువైన వస్తు,సేవలను దిగుమతి చేసుకుంది. 2026 జనవరిలో మన దేశం చేసుకున్న దిగుమతుల విలువ మరింత పెరిగి రూ.8.24 లక్షల కోట్లకు చేరింది. ఈవివరాలను కేంద్ర వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ సోమవారం మీడియాకు వెల్లడించారు. ఈ సంవత్సరం జనవరిలో భారత్ రూ.94వేల కోట్ల (10.38 బిలియన్ డాలర్ల) వాణిజ్య లోటును ఎదుర్కొందని ఆయన తెలిపారు. 2025 జనవరిలో ఏర్పడిన రూ.48వేల కోట్ల (5.39 బిలియన్ డాలర్ల) వాణిజ్య లోటుతో పోలిస్తే ఇది రెట్టింపు అన్నారు. మొత్తం మీద విదేశాలకు వస్తు,సేవల ఎగుమతిలో భారత్ వేగం కొనసాగిందని రాజేశ్ అగర్వాల్ పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (2025 – 2026)లో భారత్ మొత్తం ఎగుమతుల విలువ రూ.78 లక్షల కోట్లు (860 బిలియన్ డాలర్ల) దాటే అవకాశం ఉందని ఆయన చెప్పారు. ఇందులో ఒక్క సేవారంగ ఉత్పత్తుల ఎగుమతుల విలువే రూ.37.19 లక్షల కోట్ల దాకా ఉంటుందన్నారు.

10 నెలల్లో భారత్ సాధించిన ఫలితాలివీ

"2025 జనవరితో పోలిస్తే 2026 జనవరిలో విదేశాలకు భారతదేశ వస్తువులు, సరుకుల ఎగుమతి విలువ రూ.3.29 లక్షల కోట్ల నుంచి రూ.3.31 లక్షల కోట్లకు పెరిగింది. ఇక ఇదే వ్యవధిలో భారతదేశ సేవారంగ ఉత్పత్తుల ఎగుమతి విలువ రూ.3.15 లక్షల కోట్ల నుంచి రూ.3.98 లక్షల కోట్లకు పెరిగింది. 2024 ఏప్రిల్ నుంచి 2025 జనవరి మధ్యకాలంలో రూ.61.59 లక్షల కోట్ల వస్తు,సేవల ఎగుమతులు చేసిన భారత్, 2025 ఏప్రిల్ నుంచి 2026 జనవరి మధ్యకాలంలో రూ.65.38 లక్షల కోట్ల ఎగుమతులు చేసింది. స్థూలంగా ఈ ఆర్థిక సంవత్సరం తొలి 10 నెలల్లో (2025 ఏప్రిల్ – 2026 జనవరి) భారతదేశ ఎగుమతుల విలువ 6.15 శాతం పెరిగింది. ఈ వ్యవధిలో అదనంగా రూ.3.62 లక్షల కోట్ల ఎగుమతులను మనం సాధించగలిగాం. వస్తు,ఉత్పత్తులతో పాటు సేవల ఎగుమతుల్లోనూ పురోగతిని నమోదు చేశాం" అని కేంద్ర వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ వివరించారు.

ట్రేడ్ డీల్‌పై వచ్చే వారం వాషింగ్టన్‌లో చర్చలు

భారత్ – అమెరికా ట్రేడ్ డీల్‌పై లీగల్ అగ్రిమెంట్‌కు అవసరమైన కార్యాచరణపై వచ్చే వారం వాషింగ్టన్ వేదికగా చర్చలు జరుగుతాయని కేంద్ర వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ వెల్లడించారు. దీనిపై అమెరికా ప్రతినిధులతో చర్చించేందుకు చీఫ్ నెగోషియేటర్ దర్పణ్ జైన్ సారథ్యంలో భారత ప్రతినిధుల బృందం అమెరికాకు వెళ్తుందని ఆయన తెలిపారు. ప్రస్తుతానికి వాణిజ్య ఒప్పందంపై అమెరికా, భారత్ ప్రతినిధుల మధ్య వర్చువల్‌గా సంప్రదింపులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ డీల్‌పై లీగల్ అగ్రిమెంట్‌ను రాయడానికి, దానిపై ఇరుదేశాలు ఏకాభిప్రాయానికి రావడానికి కొంత సమయం పడుతుందన్నారు. ఈ ఏడాది మార్చి నెలాఖరు కంటే ముందే అమెరికాతో భారత్ ట్రేడ్ డీల్ కుదిరే అవకాశం ఉందని రాజేశ్ అగర్వాల్ పేర్కొన్నారు. కెనడాతోనూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకునే దిశగా భారత్ ముమ్మర కసరత్తు చేస్తోందన్నారు. దీనితో ముడిపడిన టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్‌లకు భారత్, కెనడాల ప్రతినిధులు ఇప్పటికే తుదిరూపును ఇచ్చారన్నారు.

అమెరికా మార్కెట్ భారత్‌లోని ఆ రంగాలకు ఆరోప్రాణం

"అమెరికా అనేది భారత్‌కు బలమైన మార్కెట్. భారత్‌లోని కార్మిక ఆధారిత రంగాలకు అమెరికా మార్కెట్ ఆరో ప్రాణం లాంటిది. భారత్‌కు చెందిన వస్తు,సేవలపై అమెరికా విధించనున్న 18 శాతం సుంకం విషయానికొస్తే, ఆసియా ఖండంలోనే ఇంతకంటే ఎక్కువ అమెరికా సుంకాలను భరిస్తున్న దేశాలు చాలానే ఉన్నాయి. ఈ సుంకాలను వినియోగదారులు, పరిశ్రమలకు బదిలీ చేస్తే, భారత్‌కు అమెరికా మార్కెట్‌లోకి పూర్తిస్థాయి ప్రవేశం లభిస్తుంది. తప్పకుండా అమెరికా మార్కెట్‌లో ఇతర దేశాలతో భారత వస్తు,ఉత్పత్తులు పోటీపడగలవు. గత క్రిస్మస్ సమయంలో భారత ఎగుమతిదారులు గడ్డుకాలాన్ని చవిచూశారు. అమెరికా మార్కెట్ గిరాకీని వాళ్లు మిస్సయ్యారు. రాబోయే కాలంలో ఈ సమస్య ఉండదు. దేశ రైతులు, మత్స్యకారులు, పాడి రైతులు, డైరీల గురించి ఆలోచించే అన్ని ట్రేడ్ డీల్స్ కుదుర్చుకుంటున్నాం. సున్నిత రంగాలను కాపాడుకుంటున్నాం" అని కేంద్ర వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ తెలిపారు.

## దుబాయ్‌లో చిక్కుకుపోయిన సింధు

## పరిస్థితి భయంకరంగా ఉందంటూ పోస్ట్!

పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు- గల్ఫ్ గగనతలం మూసివేత- దుబాయ్ ఎయిర్ పోర్టులో చిక్కుకున్న పీవీ సింధు



పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు దుబాయ్ ఎయిర్ పోర్ట్ లో చిక్కుకుపోయింది. యుద్ధ ఉద్రిక్తతల ప్రభావం విమాన సర్వీసులపై పడంతో గల్ఫ్ దేశాల్లో విమాన సర్వీసులు నిలిచిపోయాయి. తదుపరి నోటీసు వరకు అన్ని విమాన సర్వీసులను రద్దు చేశారు. దీంతో ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ కోసం తమ టీమ్ తో కలిసి ఇంగ్లాండ్ వెళ్తున్న సింధు దుబాయ్ లోనే ఆగిపోయింది. ఈ క్రమంలో ఆమె సోషల్ మీడియా వేదికగా అక్కడి తాజా పరిస్థితిని షేర్ చేసింది. ప్రస్తుతానికి తాను సురక్షితంగానే ఉన్నట్లు సింధు పేర్కొంది. దుబాయ్ ఎయిర్ పోర్టు సిబ్బంది, ఇండియా హై కమిషన్ అధికారులు అక్కడి పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నారని తెలిపింది. 'ఈ కఠిన పరిస్థితులు కొనసాగుతునే ఉన్నాయి. ఇక్కడ గంట గంటకూ పరిస్థితి మరింత భయంకరంగా మారుతోంది. కొన్ని గంటల కిందటే, విమానాశ్రయంలో మేం చిక్కుకున్న ప్రదేశానికి సమీపంలో పేలుడు సంభవించింది. నా కోచ్ కు దగ్గరలోనే ఆ పొగ, శిథిలాలకు పడడంతో ఆయన అక్కడ్నుంచి త్వరగా తప్పించుకున్నారు' 'మా అందరికీ ఇవి ఉద్రిక్తమైన, భయంకరమైన క్షణాలు. దుబాయ్ ఎయిర్ పోర్ట్ సిబ్బంది, దుబాయ్ అధికారుల అవిశ్రాంత కృషికి థాంక్స్ . మమ్మల్ని సురక్షితమైన ప్రదేశానికి తరలించారు. ప్రస్తుతం మేం సేఫ్ గా ఉన్నాం. మా పరిస్థితిని గమనిస్తూ, మమ్మల్ని సురక్షితంగా ఉంచడానికి నిరంతరం కృషి చేస్తున్న దుబాయ్‌లోని భారత హైకమిషన్‌కు కూడా ప్రత్యేక ధన్యవాదాలు. ప్రస్తుతానికి, మేం విశ్రాంతి తీసుకుంటున్నాం. త్వరలోనే పరిస్థితులు అదుపులోకి వస్తాయని ఆశిస్తున్నాం' అని సింధు తమ తాజా పరిస్థితిని వివరించింది

ప్రస్తుత పరిస్థిని షేర్ చేసుకున్న సింధు

కాగా, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దళాలు శనివారం దాడికి దిగాయి. ప్రతీకారంగా గల్ఫ్ దేశాలు దుబాయ్, బహ్రెయిన్, కువైట్, జోర్డాన్, సౌతా అరేబీయా, ఇరాక్, ఖతార్ దేశాల్లో ఉన్న అమెరికా స్థావరాలపై ఇరాన్ ప్రతి దాడి చేసింది. దీంతో గల్ఫ్ ప్రాంతంలో గగనతలాన్ని మూసి వేశారు. దీంతో అనేక విమాన సర్వీసులకు అంతరాయం కలిగింది. వందలాది ఫ్లైట్లు రద్దు అయ్యాయి. మోదీజీ నాకు హెల్ప్ చేయండి! బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కూడా ప్రస్తుతం దుబాయ్ లో ఉన్నారు. అయితే ఇప్పుడు అక్కడ నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులతో ఆమె ఆందోళన చెందుతున్నారు. ఎలాగైనా ఆమెను భారత్ కు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ సోషల్ మీడియాలో ఓ పోస్టు షేర్ చేశారు. 'ప్రధాని నరేంద్ర మోదీ జీ, ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా నేను ప్రస్తుతం దుబాయ్‌లో చిక్కుకున్నా. ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారంగా విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. భారత్‌కు రిటర్న్ వచ్చేందుకు ఇప్పుడు సరైన మార్గం లేదు. నేను సేఫ్ గా ఇండియాకు వచ్చేందుకు నాకు సహకారం అందించండి' అని సోనాల్ ఇన్ స్టాగ్రామ్ స్టోరీలో పోస్టు పెట్టారు. అయితే సోనాల్ ఇటీవల హాలీడే ట్రిప్ కోసం కొన్ని రోజులు దుబాయ్ వెళ్లినట్లు తెలుస్తోంది.

# ఒక ప్రాణాంతక వ్యాధి – ఎవరికి వస్తుందో తెలుసా

## కండరాల బలహీనత – ఒక్క ఇంజెక్షన్ రూ.16 కోట్లు – అసలేంటిది



చిన్నారి "పునర్విక" పేరు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. ఈ చిన్నారికి పునర్జన్మను ఇవ్వడం కోసం తెలుగు రాష్ట్రాల యువత ఏకమై విరాళాలు సేకరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లాలోని వెల్దుర్తికి చెందిన సురేశ్ కుమార్, పుష్పావతి దంపతులకు 2025 ఏప్రిల్ 12న జన్మించింది. అయితే, 6 నెలలైనా చిన్నారిలో ఎలాంటి కదిలికలు లేకపోవడంతో తల్లిదండ్రులు వైద్య పరీక్షలు చేయించారు. అప్పుడు పాప అరుదైన స్పైనల్ మస్క్యులర్ ఆంట్రోఫీ (ఎస్ఎంఏ) అనే సమస్యతో బాధపడుతున్నట్లు బయటపడింది. దీనికి రూ. 16 కోట్ల విలువ చేసే ఇంజెక్షన్ మాత్రమే చికిత్స అని డాక్టర్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఎస్ఎంఏ అంటే కారణమేంటి? లక్షణాలు? నివారించుకోవచ్చా లాంటి విషయాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం! పుట్టిన తర్వాత నెలలు గడుస్తున్న కొద్దీ మెడ నిలపటం, బోర్లా పడటం, పాకటం, కూర్చోవటం, నిల్చోవటం, నడవడం ఇలా ఒక్కొక్కటిగా అలవడుతూ వస్తుంటాయి. చిన్నారుల దృష్టితో చూస్తే ఒక్కోటీ ఒక్కో ఘన విజయమే. బలం మొత్తం కూడదీసుకొని ఒక్కో పని నేర్చుకుంటారు. ఇందుకు వెన్నుపాములోని నాడీ కణాలు కీలక పాత్ర పోషిస్తాయి. వీటి నుంచి అందే సంకేతాల మీదనే కండరాల కదలికలు ఆధారపడి ఉంటాయి. ఎస్ఎంఏ సమస్యతో పుట్టిన పిల్లల్లో ఇవే కొరవడతాయి. మన దేశంలో ఏటా సుమారు 4 వేల మంది శిశువులు ఈ సమస్యతో జన్మిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి. ఈ ప్రాబ్లమ్ వచ్చిందంటే ఒకప్పుడు ఆశలు వదులుకునేవారు. కానీ, ఇప్పుడు దీనికి చికిత్స ఉంది. ఇది జన్యు చికిత్సలోనే ఓ అత్యద్భుత విజయంగా నిలుస్తోంది. దీన్ని ముందే గుర్తించటం, ఆధునిక చికిత్స అందించడం వల్ల ఎంతో మంది పిల్లలు హాయిగా జీవించగలుగుతున్నారు. కానీ.. ఈ జన్యు చికిత్స అత్యంత ఖరీదైంది కావటమే అడ్డంకిగా మారింది.

ఏంటీ సమస్య : స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ అనేది కండరాల బలహీనతను మరింత తీవ్రతరం చేసే జన్యుపరమైన పరిస్థితి అని అధ్యయనం పేర్కొంది. ఇది వెన్నుపాములోని ప్రత్యేకమైన యాంటీరియల్ హార్న్ సెల్స్ (నాడీ కణాల) మీద తీవ్ర ప్రభావం చూపుతుంది. కూర్చోవటం, నిల్చోవటం, పాకటం, నడవటం, మింగటం, శ్వాస తీసుకోవటం వంటి పనులకు సాయం చేసే కండరాలను ఈ యాంటీరియల్ హార్న్ కణాలే నియంత్రిస్తాయని ప్రముఖ న్యూరోసైన్సెస్ పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్ డా. రమేశ్ కోణంకి చెబుతున్నారు. ఇవి క్షీణించినా, మరణించినా కండరాలు క్రమంగా బలహీనం అవుతాయని అంటున్నారు. ఇదే జరిగితే.. పిల్లలు కూర్చోవటం, లేవటం, నడవటం కష్టమవుతుందని పేర్కొంటున్నారు. కొన్నిసార్లు శ్వాస తీసుకోవటం, ఆహారం మింగటమూ కష్టం కావొచ్చని తెలియజేస్తున్నారు. వీరి తెలివి తేటలు అందరిలా మామూలుగానే ఉన్నప్పటికీ.. కాళ్లు, చేతుల భాగాల్లో కదలికలు దెబ్బతింటాయని చెబుతున్నారు. కారణమేంటి : (సర్వైవల్ మోటర్ న్యూరాన్1) జన్యువులో లోపం కారణంగా ఎస్ఎంఏ తలెత్తుతుందట. వెన్నుపాములోని చలన నాడీ కణాలు సజీవంగా ఉండటానికి, సక్రమంగా పనిచేయటానికిది ఎస్ఎంఎన్1 జన్యువులు తోడ్పడుతాయని రమేశ్ కోణంకి చెబుతున్నారు. శరీరంలోని వివిధ కండరాల కదలికలను నియంత్రించటంలో కీలక పాత్ర పోషించే ఎస్ఎంఎన్ ప్రొటీన్ దీన్నుంచే పుట్టుకొస్తుందట. ఈ జన్యువు లోపిస్తే ప్రొటీన్ తగినంత ఉత్పత్తి కాదని పేర్కొంటున్నారు. దీంతో చలన నాడీ కణాలు క్రమంగా దెబ్బతింటూ వస్తాయని తెలియజేస్తున్నారు. ఫలితంగా, మెదడు, కండరాల మధ్య సంకేతాల ప్రసారం ఆగిపోతుందని వివరిస్తున్నారు. ఇది క్రమంగా కండరాల బలహీనతకు, చచ్చుబడటానికి దారితీస్తుందని చెబుతున్నారు. అనేది వయసుతో పాటు ముదురుతూ వచ్చే సమస్య. అంటే, పిల్లలు పెద్దగా అవుతున్న కొద్దీ బలహీనమవుతూ వస్తారని చెబుతున్నారు. నిజానికి, ఎస్ఎంఎన్1 జన్యు లోపాన్ని ఎస్ఎంఎన్2 జన్యు ప్రతుల సంఖ్యను బట్టి తీవ్రత ఆధారపడి ఉంటుందని పేర్కొంటున్నారు. వీటి ప్రతులు ఎంత ఎక్కువగా ఉంటే జబ్బు తీవ్రత అంత తగ్గుతుందని తెలియజేస్తున్నారు. శిశువుల్లో : కండరాలు, కాళ్లు, చేతులూ వదులుగా, వేలాడుతున్నట్టుగా (హైపోటోనియా) ఉంటాయంటున్నారు. అంతేకాదు, మెడ సరిగా నిలపలేకపోవటం, పక్కకు దొర్లలేకపోవటం, బలహీనంగా ఏడవటం, పాలు సరిగా తాగకపోవటం, శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది పడటం కనిపిస్తుందని పేర్కొంటున్నారు. కాస్త పెద్ద పిల్లల్లో : నిద్రపోయిన తర్వాత లేచి కూర్చోవడానికి చాలా ఇబ్బంది పడతారని నిపుణులు చెబుతున్నారు. అలాగే, కూర్చున్నప్పుడు ముందుకు వంగుతారని చెబుతున్నారు. దేనినైనా పట్టుకొని లేవటమూ, నడవటమూ కష్టంగా ఉంటుంది. పెద్ద పిల్లల్లో : నడుస్తున్నప్పుడు పక్కలకు ఊగటం, నేల మీది నుంచి లేవటానికి కష్టపడటం, మెట్లు ఎక్కటానికి, దిగటానికి ఇబ్బంది పడటం, చేతులు వణకటం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. బలంగా దగ్గలేకపోవటం, తరచూ ఛాతీ ఇన్ ఫెక్షన్లు రావటం, వీపు కండరాల బలహీనత మూలంగా పెద్ద పిల్లల్లో వెన్నెముక పక్కకు వంగటం వంటి లక్షణాలు ఉంటాయట. నాలుగు రకాలు : అప్పుడే పుట్టిన శిశువుల దగ్గరి నుంచి పెద్దవారి వరకూ ఏ వయసులో అయినా రావొచ్చంటున్నారు నిపుణులు. జబ్బు లక్షణాలు ఏ వయసులో మొదలయ్యాయి దాని తీరు, తీవ్రత ఎలా ఉన్నాయి ఆధారంగా ఎస్ఎంఏను నాలుగు రకాలుగా వర్గీకరించారని అధ్యయనం పేర్కొంది. టైప్ 1 : ఇందులో కండరాల బలహీనత 3 నుంచి 4 నెలల వయసు నుంచే మొదలవుతుంది. అరుదుగా కొంతమందికి పుట్టుకతోనే బలహీనత ఉండొచ్చు. ఈ పిల్లలు మెడ సరిగా నిలపలేకపోవడం, పాకటంలో ఇబ్బంది పడతారు. సరిగా కూర్చోలేరు. తరచూ శ్వాస సమస్యలతో ఇబ్బంది పడుతుంటారు. సరైన చికిత్స అందకపోతే ఇలాంటి పిల్లలు రెండేళ్లలోపే మరణించవచ్చంటున్నారు నిపుణులు. శ్వాస తీసుకోవటానికి తోడ్పడే కండరాలు బలహీనంగా ఉండడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణమని చెబుతున్నారు. టైప్ 2 : సాధారణంగా 18 నెలలు (ఏడాదిన్నర) వయసు వచ్చేసరికి కండరాల బలహీనత ప్రారంభమవుతుంది. వీళ్లు తమంత తాము కూర్చోగలరు. కానీ సొంతంగా నడవలేరు. దేనినైనా పట్టుకొని లేవటానికీ కష్టపడతారు. వయసు పెరుగుతున్న కొద్దీ బలహీనత ఎక్కువవుతుందంటున్నారు నిపుణులు. 5–10 ఏళ్లు వచ్చేసరికి కూర్చునే సామర్థ్యాన్నీ కోల్పోతారని పేర్కొంటున్నారు. అలాగే, శ్వాస కండరాల బలహీనత, వెన్నుపాము లోపాల మూలంగా జీవనకాలమూ తగ్గుతుందని తెలియజేస్తున్నారు. టైప్ 3 : ఇది 18 నెలల తర్వాత కనిపిస్తుంది. ఈ పిల్లలు తమంత తాము నడవగలరు. కానీ, కింద కూర్చొని లేవటానికి ఇబ్బంది పడతారు. మెట్లు ఎక్కటం, పరుగెత్తటమూ కష్టంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఏళ్లు గడుస్తున్న కొద్దీ నడిచే సామర్థ్యమూ కొరవడుతుందని అంటున్నారు. టైప్ 4 : 18 ఏళ్లు తర్వాత టైప్ 4 అభివృద్ధి చెందుతుంది. లక్షణాలలో తేలికపాటి నుంచి మితమైన కాళ్ల కండరాల బలహీనత, ఇతర లక్షణాలు కనిపిస్తాయి. అధునాతన చికిత్సలు : వీలైనంత త్వరగా గుర్తించి, చికిత్స ప్రారంభించటం చాలా ముఖ్యం. లేకపోతే కండరాలు బలహీనమై కూర్చోవటమే కష్టం కావొచ్చంటున్నారు నిపుణులు. కొన్నిసార్లు ప్రాణాంతకంగానూ పరిణమించొచ్చని హెచ్చరిస్తున్నారు. గతంలో ఎస్ఎంఏకు దన్నుగా నిలిచే చికిత్స తప్ప మరొకటి ఉండేది కాదని, ఇప్పుడు జబ్బును మార్చేయగల చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని సూచిస్తున్నారు. న్యూసినెర్సన్ : అన్నిరకాల ఎస్ఎంఏకు అనుమతి పొందిన తొలి ఔషధం ఇదే. దీన్ని ఇంజెక్షన్ల రూపంలో వెన్నుపాములోకి ఇస్తారు. ప్రతి 4 నెలలకు ఒక మోతాదు ఇస్తే సరిపోతుంది. ఇది ఎస్ఎంఎన్2 ప్రొటీన్ ఉత్పత్తిని పెంచటం ద్వారా జబ్బు అదుపులో ఉండటానికి తోడ్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ ఇంజెక్షన్లను పిల్లలు జీవితాంతం తీసుకోవాల్సి ఉంటుందని తెలియజేస్తున్నారు. ఇంట్రావీనస్ జన్యు చికిత్స : దీన్ని లైఫ్ లో ఒక్కసారి తీసుకుంటే చాలు. ఇందులో కృత్రిమంగా తయారుచేసిన ఎస్ఎంఎన్1 జన్యు ప్రతిని రక్తనాళం ద్వారా రక్తంలో ప్రవేశపెడతారు. ఇది మెదడు, చలన నాడీ కణాలకు చేరుకుంటుందని నిపుణులు చెబుతున్నారు. ఎస్ఎంఎన్1 ప్రొటీన్ ఉత్పత్తిని పెంచుతుందని అంటున్నారు. దీన్ని శిశువులకు, రెండేళ్ల లోపు పిల్లలకు ఇవ్వచ్చని సూచిస్తున్నారు. రిస్డిప్లామ్ : ఇది నోటి ద్వారా తీసుకునే ఔషధం. పొడి రూపంలో ఉండే దీన్ని ద్రవ రూపంలోకి మార్చి తీసుకోవాల్సి ఉంటుందంటున్నారు నిపుణులు. రోజుకోసారి చొప్పున జీవితాంతం వాడుకోవాలని చెబుతున్నారు. చిన్నారుల దగ్గరి నుంచి పెద్దవాళ్ల వరకూ అన్ని రకాల ఎస్ఎంఏలకూ పనిచేస్తుంది. ఇంట్రాథీకల్ జన్యు చికిత్స : ఇది ఈ మధ్యకాలంలో అనుమతి పొందిన అధునాతన చికిత్స. దీన్ని నేరుగా వెన్నుపాములోకి ఇవ్వాల్సి ఉంటుందంటున్నారు నిపుణులు. ఇందులోనూ కృత్రిమ ఎస్ఎంఎన్1 జన్యు ప్రతిని శరీరంలోకి ప్రవేశపెడతారని చెబుతున్నారు. ఒకసారి తీసుకుంటే సరిపోతుందని పేర్కొంటున్నారు. దీన్ని 2 నుంచి 18 ఏళ్ల పిల్లలకు ఇవ్వచ్చని వివరిస్తున్నారు. నిపుణుల బృందం అవసరం : నాడీకండర బలహీనత చికిత్సకు రకరకాల నిపుణులు అవసరం ఉంటుంది. మందులతో పాటు ముమ్మందు ఇతరత్రా సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తగా ఉండటం తప్పనిసరంటున్నారు నిపుణులు. అందువల్ల నిపుణుల బృందం పర్యవేక్షణలో సమష్టిగా ప్రయత్నించాల్సి ఉంటుందని తెలియజేస్తున్నారు. ఎస్ఎంఏ బాధితులకు కండరాలు బలం పుంజుకోవటానికి, కదలికలు సాఫీగా సాగేలా చూడటానికి ఫిజికల్ థెరపీ, రిహాబిలిటేషన్ అవసరమవుతుందని వెల్లడిస్తున్నారు. తల్లిదండ్రులకు జన్యులోపమున్నా కారక జన్యు లోపం తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమిస్తుందని అధ్యయనం పేర్కొంది. అయితే తల్లిదండ్రులకు జన్యు లోపం ఉన్నా పిల్లలకు కచ్చితంగా రావాలనేమీ లేదు. తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరికి జన్యు లోపముంటే పిల్లలకు జబ్బు రాదు. ఇద్దరికీ జన్యు లోపముంటే 25 శాతం ముప్పు పొంచి ఉంటుందంటున్నారు నిపుణులు. అంటే ప్రతి నలుగురిలో ఒకరికి మాత్రమే జబ్బుగా మారుతుందట. మిగతా వారిలో జన్యు లోపమున్నా ఆరోగ్యంగానే ఉంటారని చెబుతున్నారు. కాకపోతే పెద్దయ్యాక వీరి నుంచి పిల్లలకు జన్యులోపం సంక్రమించే అవకాశముందని తెలియజేస్తున్నారు. నిర్ధారణ ఇలా : నాడుల పనితీరును తెలిపే నర్వ్ కండక్షన్ పరీక్ష ద్వారా ఎస్ఎంఏను నిర్ధారిస్తారు. అలాగే మీఎల్‌పీఏ అనే రక్త పరీక్ష కూడా అవసరమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఎస్ఎంఎన్1 జన్యువు లోపించినా, మార్పులు తలెత్తినా బయటపడతాయని పేర్కొంటున్నారు. ఒకప్పుడు ఎస్ఎంఏ నిర్ధారణకు కండరం నుంచి చిన్న ముక్కను తీసి పరీక్షించేవారని, మీఎల్‌పీఏ రక్త పరీక్ష అందుబాటులోకి వచ్చాక దీని అవసరం లేదని తెలియజేస్తున్నారు. చాలా పాశ్చాత్య దేశాల్లో నవజాత శిశువులకు ముందస్తు పరీక్షల్లో భాగంగా ఎస్ఎంఏ పరీక్షనూ చేస్తున్నారట. దీంతో లక్షణాలు ఆరంభం కావటానికి ముందే జబ్బును పట్టుకోవటం సాధ్యమవుతోందని అంటున్నారు. ఆనవాళ్లు కనిపిస్తే సత్వరం చికిత్స మొదలెట్టటానికీ వీలవుతోందని తెలియజేస్తున్నారు. నివారించుకోవచ్చా : పిల్లలు పుట్టిన తర్వాత ఎస్ఎంఏ నివారణ సాధ్యం కాదు. కానీ, పుట్టక ముందు జాగ్రత్త పడొచ్చంటున్నారు నిపుణులు. కొత్తగా పెళ్లయి, సంతానం కోసం ప్రయత్నించే వారు ముందుగానే జన్యు పరీక్ష చేయించుకొని, లోపాన్ని గుర్తించొచ్చని తెలియజేస్తున్నారు. ఒకవేళ గర్భం ధరించినా ఉమ్మనీటిని పరీక్షించి, జన్యులోపాన్ని తెలుసుకోవచ్చని చెబుతున్నారు. ఒక జన్యు ప్రతి తల్లి నుంచి, మరో ప్రతి తండ్రి నుంచి సంక్రమిస్తుందని పేర్కొంటున్నారు. రెండింటిలో లోపం ఉంటేనే బిడ్డకు జబ్బు లక్షణాలు మొదలవుతాయని వివరిస్తున్నారు. ఒక ప్రతిలోనే మార్పులుంటే ఆరోగ్యంగానే ఉంటారని వెల్లడిస్తున్నారు. కాబట్టి, వీటి ఆధారంగా గర్భాన్ని కొనసాగించాలో, వద్దో నిర్ణయించుకోవచ్చని సూచిస్తున్నారు. పుట్టిన తర్వాత నవజాత శిశువులకు ముందస్తు పరీక్ష చేయించవచ్చని చెబుతున్నారు. ఇది జన్యు లోపాన్ని ఆపలేదు కానీ కండరాలు దెబ్బతినక ముందే చికిత్స ఆరంభిస్తే వైకల్యం బారినపడకుండా కాపాడుకోవచ్చని పేర్కొంటున్నారు. రాత్రిపూట బైప్యాప్ పరికరంతో శ్వాస సరిగా తీసుకునేలా చూసుకోవాల్సి ఉంటుందని తెలియజేస్తున్నారు. లంగ్స్ నుంచి జిగురు ద్రవం బయటకు వెళ్లటానికి, శ్వాస సరిగా తీసుకునేలా చూడటానికి, శ్వాస సమస్యల నివారణకు ఛాతీ ఫిజియోథెరపీ కూడా అవసరమంటున్నారు. డాక్టర్ల సలహా మేరకు మంచి పోషకాహారం తీసుకోవటం చాలా అవసరమని చెబుతున్నారు. కండరాలకు సత్తువ లభించేలా, రోగనిరోధకశక్తి పెంపొందేలా ఆహారంలో మార్పులు చేసుకోవాల్సి ఉంటుందని వివరిస్తున్నారు. వెన్నెముక, కీళ్లు బాగుండటానికి ఎముకల నిపుణుల తోడ్పాటు కావాలని తెలియజేస్తున్నారు. వంగిన వెన్నెముకను సరిచేయటమూ ముఖ్యమట. న్యుమోనియా వంటి శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల నివారణకు అవసరమైన టీకాలు ఇప్పించటం చాలా అవసరమని చెబుతున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# టీ20 వరల్డ్ కప్ చరిత్రలో 'ఒకేఒక్కడు'- మూడుసార్లు ఫైనల్ ఆడిన ఏకైక భారత క్రికెటర్

## టీ20 వరల్డ్ కప్ లో అరుదైన ఘనత– మూడు సార్లు ఫైనల్స్ ఆడిన ఏకైక భారత ఆటగాడిగా రికార్డ్




క్రికెట్ లో ఎన్నో రికార్డులు చూస్తుంటాం కానీ కొన్ని మాత్రం చాలా స్పెషల్ గా ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ముఖ్యంగా వరల్డ్ కప్ లాంటి మెగా టోర్నీలో ఏ ప్లేయరైనా ఫైనల్ కు వెళ్లి టైటిల్ నెగ్గాలని అనుకుంటాడు. ఇలాంటి మెగా టోర్నీల్లో ఫైనల్ వరకు వెళ్లడం అనేది పెద్ద సవాలుతో కూడుకున్నది. అలాంటిది ఒక క్రికెటర్ ఒకటికాదు, రెండు కాదు ఏకంగా మూడుసార్లు తన కెరీర్లో టీ20 వరల్డ్ కప్ ఫైనల్ ఆడాడు. అది కూడా భారత ప్లేయరే కావడం విశేషం. 2007లో ఈ పొట్టి ఫార్మాట్ మొదలైనప్పటి నుంచి టీమ్ఇండియా ఎంతో మంది దిగ్గజాలను చూసింది. కానీ ఇన్నేళ్లలో ఒక్కడంటే ఒక్కడే మూడుసార్లు ఫైనల్ మ్యాచ్ ఆడాడు. అందుకో రెండుసార్లు ట్రోఫీని ముద్దాడాడు. మరి ఈ అరుదైన ఘనత దక్కించుకున్న మన భారత క్రికెటర్ ఎవరో? ఆ జర్నీ ఏంటో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం!

ఎంట్రీలోనే పాకిస్థాన్ పై సూపర్ విక్టరీ

ఆ ఆటగాడు మరెవరో కాదు, మన 'హిట్ మ్యాన్ రోహిత్ శర్మ'. తన కెరీర్ ప్రారంభంలోనే రోహిత్ కు 2007 టీ20 వరల్డ్ కప్ ఫైనల్ ఆడే అవకాశం వచ్చింది. సౌతాఫ్రికాలో జరిగిన ఆ టోర్నీలో దాయాది దేశం పాకిస్థాన్ తో ఫైనల్ ఫైట్ జరిగింది. ఆ ఉత్కంఠభరితమైన మ్యాచ్ లో రోహిత్ మెరుపు ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. 16 బంతుల్లోనే 30 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఎంఎస్ ధోనీ కెప్టెన్సీలో భారత్ ఆ మ్యాచ్ గెలిచి తొలిసారి వరల్డ్ ఛాంపియన్ గా నిలిచింది. యువ క్రికెటర్ గా కెరీర్ తొలినాళ్లలోనే ప్రపంచ కప్పును ముద్దాడటం రోహిత్ కు ఎప్పటికీ ప్రత్యేకంగా ఉండిపోతుంది.

రెండోసారి ఫైనల్– ఈసారి మిస్!

ఏడేళ్ల గ్యాప్ తర్వాత 2014లో టీమ్ఇండియా రెండోసారి టీ20 ఫైనల్ చేరింది. ఈ జట్టులోనూ రోహిత్ శర్మ సభ్యుడే. బంగ్లాదేశ్ వేదికగా జరిగిన ఈ టోర్నీలో భారత్ అదరగొట్టి ఫైనల్ దాకా వెళ్లింది. అయితే అక్కడ శ్రీలంకతో జరిగిన మ్యాచ్ లో టీమ్ఇండియాకు నిరాశ ఎదురైంది. ధోనీ కెప్టెన్ గా ఉన్నప్పుడు ఐసీసీ ఫైనల్ లో భారత్ ఓడిపోయిన ఏకైక మ్యాచ్ ఇదే కావడం గమనార్హం. రోహిత్ ఈ మ్యాచ్ లో 26 బంతుల్లో 29 పరుగులు చేశాడు.

ఈసారి కెప్టెన్‌గా!

రోహిత్ శర్మ కెరీర్ లోనే హైలైట్ గా నిలిచిపో సందర్భం 2024 టీ20 వరల్డ్‌కప్. వెస్టిండీస్– అమెరికా సంయుక్త వేదికలుగా జరిగిన ఈ టోర్నీలో రోహిత్ కెప్టెన్ గా భారత జట్టును నడిపించాడు. సౌతాఫ్రికాతో జరిగిన హోరాహోరీ ఫైనల్ మ్యాచ్ లో టీమ్ఇండియా ఉత్కంఠ విజయం సాధించింది. దీంతో 18ఏళ్ల తర్వాత భారత్ మళ్లీ టీ20 వరల్డ్ ఛాంపియన్ గా నిలిచింది. ఈ మ్యాచ్ తో రోహిత్ శర్మ మూడు టీ20 వరల్డ్ కప్ ఫైనల్స్ ఆడిన ఏకైక భారతీయ క్రికెటర్‌గా సరికొత్త చరిత్ర సృష్టించాడు.

కోహ్లీ ధోనీకి కూడా సాధ్యం కాని రికార్డ్

ప్రపంచవ్యాప్తంగా చూస్తే, మూడు సార్లు టీ20 వరల్డ్ కప్ ఫైనల్స్ ఆడిన ప్లేయర్లు చాలా తక్కువ మంది ఉన్నారు. మన దేశం నుంచి ఆ గౌరవం కేవలం రోహిత్ శర్మకు మాత్రమే దక్కింది. విరాట్ కోహ్లీ, ధోనీకి కూడా సాధ్యం కాని ఈ అరుదైన ఫీట్ ను రోహిత్ సాధించడం విశేషం. ధోనీ (2007, 2014), విరాట్ (2014, 2024) రెండుసార్లే ఫైనల్స్ ఆడారు. అలా యువ ఆటగాడిగా అరంగేట్రం చేసి, అదే జట్టుకు కెప్టెన్ గా వరల్డ్ ఛాంపియన్ గా నిలబెట్టిన ఘతన హిట్ మ్యాన్ కే దక్కుతుంది.

సక్సెస్ ఫుల్ గా రిటైర్మెంట్

2024 వరల్డ్ కప్ గెలిచిన వెంటనే రోహిత్ శర్మ టీ20 ఫార్మాట్కు రిటైర్మెంట్ ఇచ్చేశాడు. 18ఏళ్ల సుదీర్ఘ టీ20 కెరీర్ లో రోహిత్ 159 మ్యాచ్ ల్లో 4231 పరుగులు చేశాడు. ఇందులో 5 సెంచరీలు ఉండడం విశేషం. అలాగే రోహిత్ టీ20లకు గుడ్ బై చెప్పే నాటికి ఈ ఫార్మాట్ లో అత్యధిక పరుగులు బాదిన బ్యాటర్ గా అతడే టాప్ లో ఉన్నాడు.

# స్పిరిట్ నుంచి వివేక్ ఒబెరాయ్ లుక్ విడుదల

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న హై రేంజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్'పై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన విలన్ ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ ఈ చిత్రంలో ప్రతినాయకుడిగా నటిస్తున్న సంగతి తెలిసిందే. 'వన్ బ్యాడ్ హ్యాబిట్ ఇన్ స్పిరిట్ మోడ్' అనే ట్యాగ్‌తో విడుదల చేసిన పోస్టర్‌లో వివేక్ ఒబెరాయ్ నోట్లో సిగార్‌తో పవర్‌ఫుల్ యాక్షన్ లుక్‌లో కనిపించారు. పోస్టర్‌ను బట్టి ఆయన ఓ డాన్ పాత్రలో కనిపించనున్నట్లు అర్థమవుతోంది. అయితే అదే పోస్టర్‌లో వివేక్ పక్కన కనిపించిన యువతి ఎవరు? అనే చర్చ సోషల్ మీడియాలో మొదలైంది.ఆమె పేరు ఐశ్వర్య దేశాయ్. యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్ నుంచి మార్కెటింగ్‌లో డిగ్రీ పూర్తి చేసిన ఇండో–అమెరికన్ నటి. బాలీవుడ్ చిత్రం 'గల్లీ బాయ్'లో నటించిన ఆమె, 'ర్యాట్ ఇన్ ద కిచెన్' అనే షార్ట్ ఫిల్మ్‌తో మంచి గుర్తింపు పొందారు. ఆ చిత్రానికి ఉత్తమ సహాయ నటిగా అవార్డు కూడా అందుకున్నారు. ఇప్పుడు 'స్పిరిట్'




చిత్రంతో తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. పోస్టర్‌లో వివేక్‌తో కలిసి కనిపించడం వల్ల సినిమాలో ఆమెకు కీలక పాత్ర ఉన్నట్టు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఒక్క పోస్టర్‌తోనే ఆమెకు మంచి క్రేజ్ వచ్చింది. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన త్రిప్తి డిమ్రీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, లుక్స్ ప్రేక్షకుల్లో గూస్‌బంప్స్ తెప్పించాయి. విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కీలకపాత్ర పోషిస్తుండగా, సీనియర్ నటి కాంచన కూడా ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ ఇప్పటివరకు చూడని విధంగా ఓ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. మాఫియా బ్యాక్‌డ్రాప్‌తో పాటు పోలీస్ డ్రామా ఎలిమెంట్స్ కూడా ఉండనున్నట్లు టీజర్ సూచిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషలతో పాటు చైనీస్, కొరియన్ సహా పలు విదేశీ భాషల్లో వచ్చే ఏడాది మార్చి 5న విడుదల కానుంది.




## విష్ణు విన్యాసం మూవీ లీక్ అందుకే త్వరగా విడుదల చేశాం

'విష్ణు విన్యాసం' మూవీ లీక్ అవడం వల్ల చాలా విషయాలు జరిగాయని అందుకే వారం గ్యాప్‌తో తన రెండు సినిమాలు విడుదల చేయాల్సి వచ్చిందని శ్రీవిష్ణు తెలిపారు. ఆయన కథానాయకుడిగా యదునాథ్ మారుతీరావు దర్శకత్వంలో రూపొందిన కామెడీ ఎంటర్‌టైనర్ ఇది. నయన్ సారిక కథానాయిక. తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ మూవీ చక్కటి వినోదాన్ని పంచుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీవిష్ణు మాట్లాడారు. 'సినిమా లీక్ అవడం వల్ల షూటింగ్ హడావుడిగా అయిందన్నారు. స్క్రిప్ట్‌లో ఏమైనా మార్పులు చేశారా' అని అడగ్గా, 20 రోజుల పనిని ఏడు రోజుల్లో రాత్రి, పగలూ విరామం లేకుండా చేయాల్సి వచ్చింది. టీమ్ అంతా సహకారం అందించారు. అలా చేస్తేనే ఈ టైమ్‌కు రాగలిగాం. పూర్తి ఎ÷–లానింగ్ లేకుండా ప్రచార కార్యక్రమాలు మొదలుపెట్టాల్సి వచ్చింది. దానివల్లే రెండు సినిమాలు ఒకదాని తర్వాత ఒకటి వచ్చాయి. చెన్నై నుంచి ఈ సినిమాను లీక్ చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశాం. దీనిపై కేసు నడుస్తోంది. మా నిర్మాతని బ్లాక్ మెయిల్ చేశారు. ఆయనను బెదిరిస్తూ వాళ్లు పెట్టిన సందేశాలు, ఛాంబర్‌కు మేము చేసిన ఫిర్యాదులు అన్నీ మా దగ్గర ఉన్నాయి. భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై చర్చించాలి. ప్రతి రీల్‌కు నిర్మాతను బ్లాక్ మెయిల్ చేశారు. విడుదల ముందురోజు వరకూ ఇదంతా జరిగింది. ఆ విషయంలో నిర్మాత చాలా ఇబ్బందిపడ్డారు. అలాగని మమ్మల్ని ఆందోళనకు గురి చేయలేదు' అని శ్రీవిష్ణు తెలిపారు.నిర్మాత సుమంత్ నాయుడు మాట్లాడుతూ.. 'వరుసగా ఈ సినిమాకు సంబంధించిన వీడియోలను నాకు పంపారు. ఆ సందేశాలు చూడగానే నా భవిష్యత్ కళ్ల ముందు కనపడింది. మా యూనిట్ నుంచే తెలియకుండా సన్నివేశాలు వెళ్లిపోయాయి. మాకు సినిమా క్లిప్‌లను పంపిన నెంబర్‌ను ట్రేస్ చేశాం. ఆ తర్వాత ఛాంబర్‌లో ఫిర్యాదు చేశాం. చాలా మానసిక క్షోభ అనుభవించాం. పరిస్థితి అదుపు తప్పడంతోనే మిగిలిన షూటింగ్ వేగంగా పూర్తి చేసి, ఈ సినిమాను తీసుకురావాల్సి వచ్చింది. అంతేకానీ, 'మృత్యుంజయ్' మూవీకి పోటీగా దీన్ని విడుదల చేయాలన్న ఉద్దేశం మాకు లేదు. ఆ చిత్ర నిర్మాత పరిస్థితిని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నా అని అన్నారు.

## సోలో ట్రిప్.. మీరేంటో చెబుతుంది

జీవితంలో మీరు ఒక్కసారైనా సోలో ట్రిప్ చేయకపోతే.. నిజంగా మీకేది ఇష్టమో అనేది తెలియదంటోంది నటి షాలినీ పాండే. 'అర్జున్‌రెడ్డి' చిత్రంతో అందర్నీ ఆకర్షించిన ఈమె గతేడాది ఓటీటీలో 'డబ్బా కార్టెల్' సిరీస్‌తో ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు 'బంద్‌వాలే' సిరీస్‌తో అమెజాన్ ప్రైమ్ వేదికగా సందడి చేస్తోంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికరమైన సంగతుల్ని పంచుకుంది. "నటిగా నా పని ఒక పాత్రను పోషించి దానిని వాస్తవంగా చూపిస్తూ తెరపై అలరించడం. కానీ, నిజజీవితం గురించి నేను చాలా విషయాలను తెలుసుకోవాలనుకుంటాను. దాని కోసం చిన్న చిన్న గ్రామాలకు సోలో ట్రిప్పులు వెళుతుంటాను. జీవితంలో ఒక్కసారైనా సోలో ట్రిప్ చేయాలి. అలా చేయకపోతే.. నిజంగా మీ ఇష్టాలు ఏంటనేది మీకు తెలియవు. మీరు ఎవరితోనైనా ఉన్నప్పుడు ప్రతిదాని గురించి అభిప్రాయాలను పంచుకుంటూ ఉంటారు. కానీ, ఎవరులేని సందర్భాల్లో మీతో మీరు ఉండగలరా? మీకు మీరంటే ఇష్టమేనా? అనేది కూడా తెలుసుకోవాలి. అలాంటప్పుడు ఆ ఒక్క ఒంటరి ప్రయాణం చేసినప్పుడు మిమ్మల్ని మీరు గ్రహిస్తారు. ప్రయాణం జీవితంలో మార్పులు తెస్తుంది. అపరిచితులను కలవడం.. వెళ్లిన ప్రదేశాల గురించి తెలుసుకుని స్థానికుల దృష్టితో వాటిని చూడటం. అలా మనమెవరో తెలియకపోయినా అక్కడి వాళ్లు పంచే ఆత్మీయత చాలా మంచి అనుభూతినిస్తుంది. వ్యక్తులతో సంభాషించడం, నగరాలను అన్వేషిస్తూ సంస్కృతిని అర్థంచేసుకోవడం భిన్నమైన ప్రయాణం. అందరికీ ఇలా అనిపిస్తుందో లేదో కానీ, నాకు మాత్రం ట్రిప్ తర్వాత నన్ను నేను బాగా తెలుసుకున్నాననే భావనకలుగుతుంద"ని చెప్పుకొచ్చింది.





## హిందీ అగ్ర హీరో సరసన మీనాక్షి?

తెలుగులో అగ్రకథానాయకులతోపాటు యువ హీరోల సరసన నటిస్తూ వరుస విజయాలతో జోరుమీదుంది హీరోయిన్ మీనాక్షి చౌదరి. ముగ్గుల పండక్కి 'అనగనగా ఒక రాజు' సినిమాలో చారులతగా కనిపించి.. ఈ ఏడాదిని మంచి విజయంతో ఆరంభించింది భామ. తాజాగా ఆమె బాలీవుడ్ అగ్రహీరో అక్షయ్ కుమార్‌తో జంట కట్టనుందట. ప్రియదర్శన్ దర్శకత్వంలో 2006లో విడుదలైన కామెడీ థ్రిల్లర్ 'భాగమ్ భాగ్' సినిమా సీక్వెల్‌లో ఆమె కనిపించనుందని బాలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది.
"ప్రియదర్శన్ ప్రస్తుతం అక్షయ్‌కి సంబంధించిన మూడు చిత్రాలను తెరకెక్కించే పనిలో బిజీగా ఉన్నారు. ఇప్పుడాయన రూపొందిచాలనుకున్న 'భాగమ్ భాగ్' సీక్వెల్ బాధ్యతల్ని రాజ్ శాండిల్యకు అప్పగించారు. అక్షయ్ హీరోగా రూపొందుతున్న ఈ సీక్వెల్‌లో మీనాక్షి చౌదరి, 'ధురంధర్' సినిమాలో ప్రత్యేక గీతంలో అలరించిన ఆయేషా ఖాన్‌ను కథానాయికలుగా నటించనున్నార"ని హిందీ చిత్రవర్గాల సమాచారం. మీనాక్షి ప్రస్తుతం హీరో నాగచైతన్య నటిస్తున్న 'వృషకర్మ' సినిమాతో బిజీగా ఉంది.

## మార్చి 6న మృత్యుంజయ విడుదల




టాలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ శ్రీవిష్ణు, రెబా మోనికా జాన్ జంటగా నటిస్తున్న ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ 'మృత్యుంజయ' ట్రైలర్ తాజాగా విడుదలై ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచుతోంది. 'మ్యాన్ ఆఫ్ మాసెస్' జూనియర్ ఎన్టీఆర్ ఈ చిత్ర ట్రైలర్‌ను డిజిటల్ ప్లాట్‌ఫామ్ వేదికగా విడుదల చేసి చిత్ర యూనిట్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పారు. సుకుమార్ శిష్యుడు శ్రీ హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో శ్రీవిష్ణు క్రైమ్ బ్యూరోలో ఉద్యోగం సంపాదించలేకపోయినా, తన టాలెంట్‌తో ఒక సంక్లిష్టమైన మిస్టరీని ఛేదించే ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్‌గా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతున్నాడు. 'సామజవరగమన' వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత శ్రీవిష్ణు, రెబా మోనికా జాన్ కాంబినేషన్లో వస్తున్న రెండో సినిమా కావడంతో దీనిపై మంచి క్రేజ్ నెలకొంది. కాళ భైరవ సంగీతం, లెజెండరీ ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ పనితనం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఇప్పటికే 'విష్ణు విన్యాసం' సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న శ్రీవిష్ణు, వారం రోజుల వ్యవధిలోనే మార్చి 6న 'మృత్యుంజయ'తో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మించిన ఈ చిత్రం సస్పెన్స్ థ్రిల్లర్ ప్రియులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది




## దురంధర్ పార్ట్2 విడుదలకు సిద్ధం

బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో, స్టార్ దర్శకుడు ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ స్పై థ్రిల్లర్ 'ధురంధర్: ది రివేంజ్' విడుదలకు సిద్ధమవుతోంది. అయితే ఈ సినిమా రన్ టైమ్ వివరాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ సినిమా నిడివి 220 నిమిషాలుగా ఉన్నట్లు సమాచారం. అంటే ఈ చిత్రం దాదాపు 3 గంటల 40 నిమిషాల సుదీర్ఘ రన్ టైమ్‌తో ప్రేక్షకులను అలరించబోతుంది. మొదటి భాగం 3 గంటల 34 నిమిషాలు తో పోలిస్తే ఇది 6 నిమిషాలు ఎక్కువ ఉన్నప్పటికీ, ప్రస్తుత కాలంలో అత్యంత సుదీర్ఘమైన నిడివి కలిగిన చిత్రాల జాబితాలో ఇది ఒకటిగా నిలుస్తోంది. ఈ చిత్ర కథాంశం విషయానికి వస్తే, మొదటి భాగంలో గ్యాంగ్‌స్టర్ రెహ్మాన్ డకైట్‌ను అంతం చేసిన తర్వాత, హమ్జా అలీ మజారీ పాత్రలో రణవీర్ సింగ్ తన తదుపరి లక్ష్యమైన ఐఎస్ఐ వ్యూహకర్త 'బడే సాబ్' (మేజర్ ఇక్బాల్)ను ఎలా ఎదుర్కొన్నాడు అనే ఉత్కంఠభరితమైన అంశాలతో ఈ సీక్వెల్ సాగనుంది. రణవీర్ సింగ్‌తో పాటు ఈ చిత్రంలో సంజయ్ దత్, ఆర్. మాధవన్, అక్షయ్ ఖన్నా మరియు అర్జున్ రాంపాల్ వంటి దిగ్గజ నటులు కీలక పాత్రల్లో నటిస్తుండగా, సారా అర్జున్ కథానాయికగా నటించింది. ఈ భారీ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్ మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. అదే రోజున కన్నడ స్టార్ యాష్ నటిస్తున్న 'టాక్సిక్' కూడా విడుదలవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద ఈ రెండు భారీ చిత్రాల మధ్య గట్టి పోటీ నెలకొననుంది.

## రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో భారీ అగ్నిప్రమాదం....



రంగారెడ్డి//మార్చి01(ఆకాంక్ష) : రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఆదివారం ఉదయం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. శంకర్‌పల్లి రోడ్డులో ఉన్న రిషిత ఆటోమొబైల్స్ గోదాంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గోదాంలో భారీగా నిల్వ ఉంచిన హీరో హోండా కంపెనీకి చెందిన స్పేర్‌పార్ట్స్ అగ్నికి ఆహుతయ్యాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి.ఘటనపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఫైరింజన్ల సహాయంతో గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాద సమయంలో గోదాంలో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. అయితే గోదాంలో నిల్వ ఉన్న విలువైన స్పేర్‌పార్ట్స్ పూర్తిగా దగ్ధమవడంతో దాదాపు రూ.2 కోట్ల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు ప్రాథమిక అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## గోదావరి నదిపై బాబ్లీ నుంచి నీటి విడుదల....

### ఎస్ఆర్ఎస్‌పీకి చేరనున్న 0.60 టీఎంసీలు...



హైదరాబాద్//మార్చి01(ఆకాంక్ష) : మహారాష్ట్ర రాష్ట్రంలోని బాబ్లీ ప్రాజెక్టు నుంచి ఆదివారం ఉదయం గోదావరి నదిలోకి 0.60 టీఎంసీల నీటిని విడుదల చేశారు. మహారాష్ట్ర తెలంగాణ రాష్ట్రాల ఇరిగేషన్ అధికారుల సమక్షంలో ఈ ప్రక్రియ నిర్వహించబడింది. ప్రతి సంవత్సరం వేసవికాలంలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు బాబ్లీ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.ఈ మేరకు మార్చి 1వ తేదీన గేట్లు ఎత్తాలని సుప్రీంకోర్టు నిర్దేశించినందున ఆదివారం ఉదయం అధికారులు గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని విడుదల చేశారు. విడుదల చేసిన ఈ జలాలు తెలంగాణ రాష్ట్రంలోని ఎస్ఆర్ఎస్‌పీ ప్రాజెక్టు (శ్రీరాంసాగర్ ప్రాజెక్టు)కు చేరుకోనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర నీటిపారుదల శాఖ, తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు, అలాగే కేంద్ర జల వనరుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం అమలవుతున్న ఈ నీటి విడుదల చర్య వల్ల దిగువ ప్రాంతాల ప్రజలకు తాగునీటి సరఫరా మెరుగుపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

## రాహుల్‌గావ్‌లో పేలుడు పరిశ్రమలో ఘోర విపత్తు....

### 15 మంది మృతి...



మహారాష్ట్ర//మార్చి01(ఆకాంక్ష) : మహారాష్ట్ర రాష్ట్రంలోని నాగ్‌పూర్ జిల్లాలో ఆదివారం ఉదయం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కటోల్ సమీపంలోని రాహుల్‌గావ్ గ్రామ పరిధిలో ఉన్న ఎస్‌బీఎల్ ఎనర్జీ లిమిటెడ్ పేలుడు పదార్థాల తయారీ కర్మాగారంలో భారీ పేలుడు సంభవించి కనీసం 15 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు ధృవీకరించారు. పలువురు తీవ్రంగా గాయపడగా, మరికొందరు శిథిలాల కింద చిక్కుకున్నట్లు సమాచారం. వివరాల ప్రకారం, ఆదివారం ఉదయం ఎప్పటిలాగే కార్మికులు విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. పేలుడు తీవ్రతకు కర్మాగార భవనం పెద్దఎత్తున కూలిపోయి శిథిలాలుగా మారింది. ఘటన సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, రెస్క్యూ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీయడానికి యంత్రాలతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది.పేలుడు కారణాలపై ఇంకా స్పష్టత రాలేదు. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటించబడుతున్నాయా అనే అంశంపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు వివాహ

## ఆహ్వాన పత్రిక అందజేసిన టీఎన్జీఓస్ మాజీ అధ్యక్షుడు...

### వివాహ ఆహ్వానం అందజేసి ఆశీస్సులు తీసుకున్న మామిళ్ల రాజేందర్ కుటుంబం...



హైదరాబాద్//మార్చి01(ఆకాంక్ష) : తెలంగాణ రాష్ట్ర రాజకీయ, సామాజిక వర్గాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ మాజీ అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్ ఆదివారం ప్రముఖ నేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి మరియు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎర్రవెల్లి గ్రామంలోని ఆయన నివాసంలో ఈ సమావేశం సౌహార్ద వాతావరణంలో జరిగింది.ఈ సందర్భంగా మామిళ్ల రాజేందర్ తన కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి, తన కుమారుడి వివాహానికి హాజరై ఆశీర్వదించాలని కోరుతూ వివాహ ఆహ్వాన పత్రికను కేసీఆర్‌కు అందజేశారు. ఆహ్వానాన్ని స్వీకరించిన కేసీఆర్ కుటుంబానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వరుడు-వధువులకు ఆశీస్సులు అందించారు.మామిళ్ల రాజేందర్ ఈ సందర్భంగా కేసీఆర్ ఆశీర్వాదం తీసుకుంటూ, తమ కుటుంబానికి ఇది గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ భేటీ స్నేహపూర్వకంగా కొనసాగగా, కుటుంబ సభ్యులు కూడా కేసీఆర్‌తో ముచ్చటించారు.

## మెదక్ జిల్లా ఏడుపాయలకు పోటెత్తిన భక్తులు....





మెదక్//మార్చి01(ఆకాంక్ష) : మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నాగ్సన్‌పల్లి గ్రామ శివారులోని వనదుర్గ మాత అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం భక్తుల రద్దీ భారీగా కనిపించింది. మంజీరా నది ఒడ్డున స్వయంగా వెలిసిన ఈ పవిత్ర క్షేత్రానికి సెలవు దినం కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఉదయం నుంచే భక్తులు మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నది జలాలతో అమ్మవారికి అభిషేకాలు చేసి, పుష్పాలు, పండ్లతో శంకర్ శర్మ పంతులు ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.భక్తులు అమ్మవారికి ఓడిబియాలు సమర్పిస్తూ, డప్పు చప్పులతో బోనాలు సమర్పించి తమ భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. ఉచిత దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు.ఎండోమెంట్ ఈవో వీరేశం ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది సమన్వయంతో భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.ం

## జాతీయ సైన్స్ డే సందర్భంగా చిన్నారికి అవార్డు...

### ప్రశంసాపత్రం ప్రదానం...



నాగర్ కర్నూల్ టౌన్/మార్చి01(ఆకాంక్ష) : జాతీయ సైన్స్ డే సందర్భంగా నగర్ కర్నూల్ జిల్లాలోని బిజినేపల్లి మండల కేంద్రంలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. సోషల్ రెస్పాన్సిబిలిటీ అసోసియేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సైన్స్ ప్రదర్శనల్లో విద్యార్థులు వివిధ సాంకేతిక నమూనాలు, చార్టులతో సందర్శకులను ఆకట్టుకున్నారు. ఆరోగ్యం, పర్యావరణం, సాంకేతికత వంటి అంశాలపై అవగాహన కల్పించే ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గౌరారం పాఠశాలకు చెందిన నాలుగవ తరగతి విద్యార్థిని శ్రీలత తన ప్రతిభతో అందరినీ మెప్పించింది.జంక్ ఫుడ్ వల్ల కలిగే అనర్థాలు" అనే అంశంపై ఆమె సమగ్రంగా వివరిస్తూ ఫాస్ట్ ఫుడ్ అధికంగా తీసుకోవడం వల్ల వచ్చే వ్యాధులను చార్టుల ద్వారా స్పష్టంగా తెలియజేసింది. ముఖ్యంగా చిన్నారుల్లో ఊబకాయం, మధుమేహం వంటి సమస్యలు పెరుగుతున్నాయని వివరించింది.పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పి కూరగాయలు, పండ్లు, పాలు వంటి ఆహార పదార్థాల ప్రాముఖ్యతను చాటి చెప్పింది. ఆరోగ్యకరమైన జీవనశైలి మనిషి ఎదుగుదలకు ఎంత ముఖ్యమో ఆమె తన మాటల ద్వారా చక్కగా వివరించింది.శ్రీలత వివరణ శైలి, ధైర్యంగా మాట్లాడిన తీరు అందరినీ ఆకట్టుకోవడంతో ఆమెను కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, అధికారులు ప్రశంసించారు. నగర్ కర్నూల్ జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ చేతుల మీదుగా మండల స్థాయిలో ఆమెకు మొదటి బహుమతి ప్రకటించి అవార్డుతో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. చిన్న వయసులోనే సమాజానికి అవసరమైన అంశంపై అవగాహన కల్పించడం అభినందనీయమని పేర్కొంటూ భవిష్యత్తులో ఆమె మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆశీర్వదించారు.ఈ విజయంతో గౌరారం పాఠశాల పేరు మండల స్థాయిలో నిలిచింది. జాతీయ సైన్స్ డే వేడుకల్లో చిన్నారి శ్రీలత విజయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో మండల విద్యాధికారి రఘునందన్ శర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణు, మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొని చిన్నారిని అభినందించారు. ఆమె భవిష్యత్తులో మరింత ప్రతిభ కనబరిచి ఉత్తమ విద్యార్థినిగా అందరికీ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సోషల్ రెస్పాన్సిబిలిటీ అసోసియేట్ గంగారం, అధ్యక్షులు లక్ష్మణ్, ఉపాధ్యక్షులు రమేష్ మరియు ఇతర సభ్యులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## తిమ్మారెడ్డిపల్లి సబ్ స్టేషన్ వద్ద 45 రోజుల తర్వాత మృతదేహం...



కొమురవెల్లి//మార్చి01(ఆకాంక్ష) : గత నెల జనవరి 13వ తేదీన తిమ్మారెడ్డిపల్లి సబ్ స్టేషన్ ముందు ఆటోను నిలిపి అడవిలోకి వెళ్లిన వ్యక్తి మిస్సింగ్ ఘటనకు దాదాపు 45 రోజుల తర్వాత తెరపడింది. సబ్ స్టేషన్ సమీపంలోని వ్యవసాయ భూమిలో చెట్లు కొట్టడానికి వచ్చిన భూస్వాములు తీవ్ర దుర్వాసన రావడంతో అనుమానం వచ్చి పరిశీలించగా, అక్కడ మృతదేహం కనిపించింది.స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, అది జనవరి 13న కనిపించకుండా పోయిన ఆటో డ్రైవర్‌దేనని ప్రాథమికంగా గుర్తించారు. గత 45 రోజులుగా మిస్సింగ్‌గా ఉన్న ఈ కేసు ఈ ఘటనతో ముగిసినట్లైంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, మృతికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు.

## ఘనంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం...



జడ్చర్ల//మార్చి01(ఆకాంక్ష) : ఎస్సీ వర్గీకరణ ఉద్యమ విజయాన్ని మాదిగ అమరవీరులకు అంకితం చేస్తూ జడ్చర్ల పరిధిలోని మిడ్జిల్ మండల కేంద్రంలో ఆదివారం మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగళ్ళ సురేష్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అమరవీరులకు పుష్పాంజలి ఘటించి గణమైన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్-ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి టైగర్ జంగయ్య మాదిగ మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ లక్ష్యసాధన కోసం మూడు దశాబ్దాలుగా సాగిన సామాజిక ఉద్యమంలో జాతి కోసం ప్రాణాలు అర్పించిన మాదిగ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. నేలరాలిన అమరవీరులకు సామాజిక ఉద్యమ జోహార్లు తెలియజేస్తూ కన్నీటి నివాళులు అర్పించారు. అమరవీరులు రగిలించిన సమానత్వ జ్వాల నేడు విజయ దీపంగా వెలుగుతుందని, వారి త్యాగం చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఎస్సీ రిజర్వేషన్ల ఫలాలు మాదిగ సమాజం పొందుతున్న ఈ సందర్భంలో అమరవీరుల త్యాగాలను ప్రపంచానికి చాటి చెప్పాలని, సామాజిక న్యాయ సాధనలో వారి పోరాటం ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు గణేష్ మాదిగ, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు బరిగెల దేవయ్య, గుడ్ల బాలయ్య, బరిగెల బుచ్చయ్య, సుకుమార్, మహేష్, వార్డు సభ్యులు పర్వతాలు, గోపాల్, తిరుపతి, లక్ష్మణ్ పవర్, అంజనేయులు, పోషయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో సత్యసాయి అన్నప్రసాద పంపిణీ...



నాగర్‌కర్నూల్, మార్చి01(ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ఆవరణలో గల సత్యసాయి అన్నప్రసాద కేంద్రంలో ప్రతిరోజు మధ్యాహ్నం రోగి సహాయకులకు ఉచిత భోజనం అందజేస్తున్నారు. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా కృపాకటాక్షాలతో శ్రీ సాయి ప్రశాంతి చారిటబుల్ సేవా ట్రస్ట్, భగవాన్ శ్రీ సత్యసాయి నిత్య అన్నదాన ట్రస్ట్ మరియు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం గత 7 సంవత్సరాలుగా నిర్విరామంగా కొనసాగుతోంది. ప్రతిరోజూ మధ్యాహ్నం 12:30 గంటలకు సుమారు 120 నుండి 150 మంది రోగి సహాయకులకు సంపూర్ణ భోజనం అందజేస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ ఎలిమే ఈశ్వరయ్య తెలిపారు. పండుగలు, ఉత్సవాల సందర్భాల్లో అధిక సంఖ్యలో అన్నప్రసాదం పంపిణీ చేస్తామని చెప్పారు. వివాహ వార్షికోత్సవాలు, పుట్టినరోజులు వంటి సందర్భాల్లో ప్రజలు స్వయంగా వచ్చి అన్నదానం చేయవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో గంధం సాయి ప్రకాష్, పాండు, రంగారావు, ఈ. బాలయ్య, పోల నాణ్యం, పోల రాము, శేఖరచారి, లక్ష్మణ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## సనాతన ధర్మ పరిరక్షణకు రౌండ్ టేబుల్ సమావేశం ఘనంగా నిర్వహణ...





నాగర్‌కర్నూల్, మార్చి01(ఆకాంక్ష) : మానవ మనుగడకు సనాతన ధర్మం ప్రధాన ఆధారం అని యోగ గురూజీ బీరెల్లి చంద్రారెడ్డి పేర్కొన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ అలయెన్స్ కమిటీ, సప్త ఋషి ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సాయి గార్డెన్స్‌లో సనాతన ధర్మ పరిరక్షణ కోసం రౌండ్ టేబుల్ సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ కుచుకుళ్ల రాజేష్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి భారతీయుడి కర్తవ్యమని స్పష్టం చేశారు. సమాజంలో ధార్మిక విలువలు, ఆచారాలు, సంప్రదాయాలను కాపాడటంలో అందరూ ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా యువత ధార్మిక చైతన్యంతో ముందుకు రావాలని, ఆధునికతతో పాటు సంప్రదాయాలను సమన్వయం చేసుకుంటూ నడవాలని





సూచించారు.నాగర్‌కర్నూల్ జిల్లాలోని దేవాలయాలు, ధార్మిక మరియు ఆధ్యాత్మిక సంస్థలు, కుల సంఘాలు, అర్చకులు, పౌరోహిత్య సంఘాలు ఐక్య వేదికగా ఏర్పడి సనాతన ధర్మ పరిరక్షణ కోసం కలిసి పనిచేయడం అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. భవిష్యత్తులో ఈ వేదిక ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక శిబిరాలు, ధార్మిక చైతన్య కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో సంస్కృతి పరిరక్షణపై అవగాహన పెంచాలని సూచించారు.ఈ సమావేశంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన స్వామీజీలు, పీఠాధిపతులు, గురూజీలు పాల్గొని సనాతన ధర్మం యొక్క ప్రాధాన్యతను వివరించారు. ఆధునిక జీవనశైలిలో ధార్మిక విలువలు తగ్గిపోకుండా ప్రతి కుటుంబం వాటిని పాటించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.ఈ సమావేశం అనంతరం సామూహిక భోజన వసతి ఏర్పాటు చేయగా భక్తులు, పాల్గొన్న ప్రతినిధులు పెద్ద సంఖ్యలో వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, వివిధ దేవాలయాల ప్రతినిధులు, ఆధ్యాత్మిక నాయకులు, సంఘాల ప్రతినిధులు, భక్తులు భారీగా పాల్గొన్నారు.సనాతన ధర్మ పరిరక్షణ కోసం జిల్లాలో ఐక్యంగా పనిచేసే వేదిక ఏర్పడడం భవిష్యత్తులో ధార్మిక చైతన్యానికి బలమైన పునాది అవుతుందని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

## పెద్దపల్లి జిల్లాలో నిరుద్యోగులకు వరం...

### RESET శిక్షణ కేంద్రం ప్రారంభం..



పెద్దపల్లిటౌన్ మార్చి01(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లాలోని నిరుద్యోగ యువతకు నాణ్యమైన శిక్షణ అందించి, వారిని ఉద్యోగావకాశాల వైపు నడిపించేందుకు పెద్దపల్లి జిల్లా కేంద్రంలో రాజయ్య ఎడ్యుకేషనల్ సొసైటీ ఫర్ ఎగ్జామినేషన్ ట్రెనింగ్ (=జుూజు) శిక్షణ కేంద్రాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ నూగిళ్ళ మల్లయ్య, బీసీ జేఏసీ చైర్మన్ దాసరి ఉష కలిసి ఈ కేంద్రాన్ని ప్రారంభించి యువతకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మల్లయ్య మాట్లాడుతూ సరైన మార్గదర్శకత్వం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ సాధన సులభమవుతుందని తెలిపారు. యువత తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని క్రమశిక్షణతో సిద్ధమైతే తప్పకుండా విజయం సాధిస్తారని అన్నారు. కార్పొరేట్ సంస్థలు, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను సమన్వయం చేస్తూ యువతకు సమగ్ర శిక్షణ అందించడమే ఈ సంస్థ లక్ష్యమని వివరించారు.కేంద్ర డైరెక్టర్ వొల్లె ప్రీతి ఉదయ్ మాట్లాడుతూ తక్కువ ఫీజుతో నాణ్యమైన కోచింగ్ అందించడమే ప్రధాన లక్ష్యమని, ఉచిత శిక్షణ దాతలు ముందుకు వస్తే పేద విద్యార్థులకు పూర్తిగా ఉచితంగా శిక్షణ అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పోటీ పరీక్షలకు అవసరమైన సమగ్ర పాఠ్యాంశాలతో పాటు వ్యక్తిత్వ వికాసం, ఇంటర్వ్యూ నైపుణ్యాలు వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తామని చెప్పారు. అడ్మిషన్లు ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు రాజయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మొలుగూరి కమల్, ఫణీంద్ర భూపతి, సుల్తానాబాద్ ఎక్సైజ్ ఎస్ఐ చిరంజీవి, ఆర్ఎఫ్సీఎల్ హెచ్ఆర్ సోమనాథ్, ఫిట్ అండ్ ఫ్యూచర్ ప్రతినిధులు మచ్చా రాహుల్, కల్వల చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లాలో సేంద్రియ సాగుతోనే సిరిసంపదలు సాధ్యం...

### మాజీ సైనికుల పిలుపు...





పెద్దపల్లిటౌన్//మార్చి01(ఆకాంక్ష) : భవిష్యత్తు తరాలకు సారవంతమైన భూమిని అందించాలంటే రసాయన ఎరువులను వీడి సేంద్రియ వ్యవసాయాన్ని అవలంబించాల్సిన అవసరం అత్యవసరమని మాజీ సైనికులు స్పష్టం చేశారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా రాఘవపూర్‌లోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో బ్రాహ్మణపల్లి సర్పంచ్ మేకల రోజారాణివిజయ్ కుమార్ (రిటైర్డ్ ఆర్మీ) ఆధ్వర్యంలో నిర్వహించిన "సేంద్రియ వ్యవసాయ అవగాహన సదస్సు" ఘనంగా జరిగింది.రసాయన ఎరువులు, పురుగు మందుల అధిక వినియోగం వల్ల భూమి సహజ సారాన్ని కోల్పోతుందని, భూమి నిస్సారమవుతూ భవిష్యత్తులో పంటలు పండించడం కష్టసాధ్యమవుతుందని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. భూసారాన్ని రక్షించడానికి, ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఉత్పత్తి చేయడానికి సేంద్రియ పద్ధతులే శాశ్వత పరిష్కారమని పేర్కొన్నారు. సేంద్రియ సాగుతో పెట్టుబడి తగ్గి, దిగుబడులు పెరగడమే కాకుండా రైతులకు అధిక లాభాలు లభిస్తాయని వివరించారు.మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని రైతులు సేంద్రియ వ్యవసాయంతో అద్భుత ఫలితాలు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొంటూ, మన రాష్ట్ర రైతులు కూడా ఆ మార్గాన్ని అనుసరించాలని సూచించారు. దేశ రక్షణలో భాగమైన మాజీ సైనికులు, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకైన రైతులు కలిసి పనిచేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు.శ్రీవెంకటేశ్వర కోఆపరేటివ్ సొసైటీ పవన్ అండ్ ఆగ్రో ప్రాసెసింగ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతుల పిల్లలకు వ్యవసాయ రంగంపై అవగాహన కల్పించి, సేంద్రియ సాగుపై ప్రత్యేక శిక్షణ అందిస్తామని నిర్వాహకులు ప్రకటించారు.కల్తీ లేని పోషక విలువలతో కూడిన పంటలను పండించడం తమ ప్రధాన లక్ష్యమని, జిల్లాలోని రైతులందరూ సభ్యత్వం పొంది ఆధునిక సేంద్రియ పద్ధతులతో ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు.ఈ సదస్సులో బ్రాహ్మణపల్లి సర్పంచ్ మేకల రోజారాణి విజయ్ కుమార్ (రిటైర్డ్ ఆర్మీ), రిటైర్డ్ ఆర్మీ సభ్యులు మంథని రమేష్, సర్పంచులు దాడి మౌనిక సంతోష్ బొంపల్లి, ఆరె సంతు, అప్పన్నపేట, బొక్కల సంతు, దేవునిపల్లి, సబితం సర్పంచ్ తదితరులు, పలు గ్రామాల సర్పంచులు, రైతులు, మాజీ సైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్ జిల్లాలో చిన్నారి హత్యపై ఎంపీ, ఎమ్మెల్యే ఆగ్రహం..

### మృతిపై వేగవంతంగా విచారణ పూర్తి చేయాలి ఎంపీ మల్లు రవి...



నాగర్ కర్నూల్ టౌన్//మార్చి01(ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెం గ్రామంలో చోటుచేసుకున్న మూడు నెలల చిన్నారి హత్య ఘటనపై ప్రజాప్రతినిధులు తీవ్రంగా స్పందించారు. ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ఆదివారం పాలెం గ్రామాన్ని సందర్శించి ఘటనపై వివరాలు సేకరించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారిని నీటి తొట్టిలో వేసి హత్య చేసిన ఘటన దారుణమని ఖండించారు. ఇటీవలి కాలంలో చిన్నారులపై ఇలాంటి సంఘటనలు పెరుగుతుండటం తీవ్ర ఆందోళనకరమని పేర్కొన్నారు. ఈ ఘటనపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టి నిందితులను గుర్తించి అరెస్ట్ చేసి కఠిన శిక్షలు విధించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తుందని ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా ఇలాంటి ఘటనలకు చెక్ పెట్టాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి



పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గోవింద శేఖర్, మాజీ ఉపసర్పంచ్ చిక్కంద్ర రాములు, వార్డు సభ్యులు పరుష రాములు, కాంగ్రెస్ నాయకులు గోవిందు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తొలి ఆకాంక్ష
సోమవారం-02-మార్చి-2026

# హిమోఫిలియా బాధితులకు ఫిజియోథెరపీ కిట్లు పంపిణీ..

## ఇంటాస్ ఫౌండేషన్ సేవాభావం...






సూర్యాపేట//**మర్చి01(ఆకాంక్ష)** : హిమోఫిలియా వ్యాధితో బాధపడుతున్న లబ్ధిదారులకు సేవా దృక్పథంతో ముందుకొచ్చిన ఇంటాస్ ఫౌండేషన్ ఫ్యాక్టర్ ఔషధాలు, ఫిజియోథెరపీ కిట్లను అందజేసి తన ఉదారతను చాటుకుంది. సూర్యాపేట పట్టణంలోని డివైన్ టచ్ హాస్పిటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సెల్ఫ్ ఇన్ఫ్యూషన్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ నివేత ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు కిట్లను పంపిణీ చేశారు. ఆసుపత్రికి చెందిన వైద్యులు డాక్టర్ విజయ మోహన్, డాక్టర్ సంధ్యా మోహన్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ఉపేందర్ పాల్గొని హిమోఫిలియా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ మోహన్ మాట్లాడుతూ హిమోఫిలియా ఒక అరుదైన జన్యు సంబంధిత రక్త రుగ్మత అని, ఈ వ్యాధి ఉన్నవారిలో రక్తం సరైన విధంగా గడ్డకట్టకపోవడం వల్ల గాయాలైనప్పుడు అధిక రక్తస్రావం జరుగుతుందని తెలిపారు. రక్తం గడ్డకట్టేందుకు అవసరమైన క్లాటింగ్ ఫ్యాక్టర్ లోపం కారణంగా ఈ వ్యాధి వస్తుందని, ఫ్యాక్టర్ ఇంజక్షన్ల ద్వారా చికిత్స అందిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. ఈ వ్యాధి ఎక్కువగా పురుషుల్లో కనిపిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఫిజియోథెరపీ అభ్యాసాలను ప్రత్యక్షంగా డెమో రూపంలో చూపించి, లబ్ధిదారులకు వ్యాయామాల ప్రాముఖ్యతను వివరించారు. అలాగే రోగులు తమకు తాముగా ఇంజెక్షన్లు వేసుకునే విధానంపై నర్సింగ్ ఆఫీసర్ అజయ్ సెల్ఫ్ ఇన్ఫ్యూషన్ శిక్షణ అందించారు. మొత్తం 33 మంది లబ్ధిదారులకు 58 ఫ్యాక్టర్-8 వాయిల్స్‌తో పాటు ఫిజియోథెరపీ కిట్లను ఇంటాస్ ఫౌండేషన్ ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు సుజాత, శివకుమార్, లహరి తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలి...

## ఎమ్మెల్యే విజయరామణారావు





ఓదెల//**మర్చి01(ఆకాంక్ష)** : పెద్దపల్లి జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఓదెల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంను పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు కుటుంబ సమేతంగా దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం రోజున తమ ఇలవేల్పు ఆలయమైన ఓదెల మల్లన్న ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం బోనాలు సమర్పించి, పట్నాలు వేసి స్వామి వారిని కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో కొలిచారు. తదుపరి ఆలయ కమిటీ తరపున స్వామివారి కండువాలతో పాటు మెమొంటోలతో ఎమ్మెల్యే విజయరామణారావు మరియు వారి కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చీకట్ల మొండయ్య, ఈవో సదయ్య, ఆలయ కమిటీ డైరెక్టర్లు, పలు గ్రామాల సర్పంచులు, ఆలయ అర్చకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరామణారావు మాట్లాడుతూ, ఓదెల మల్లికార్జున స్వామి ఆశీస్సులతో పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన

# మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి.



నాగర్ కర్నూల్ టౌన్,**మర్చి01(ఆకాంక్ష)** : నాగర్ కర్నూల్ జిల్లాలోని వివిధ మండలాల్లో ఇటీవల మృతి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్తల కుటుంబాలను ఆదివారం నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి పరామర్శించారు. తెలకపల్లి మండలానికి చెందిన టీఆర్ఎస్ పార్టీ నాయకుడు అతినారపు బాలకృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన దశదినకర్మ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే వారి చిత్రపటానికి పూలమాలలు అర్పించి నివాళులు ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే తెలకపల్లి మండలంలోని అనంతసాగర్ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం అదే మండలానికి చెందిన చిలుక కురుమూర్తి అనారోగ్యంతో మరణించడంతో ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నాగర్ కర్నూల్ మున్సిపల్ పరిధిలోని దేశి ఇటిక్యాల గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు శ్యామ్ సుందర్ రెడ్డి తండ్రి పండుగ శేఖర్ రెడ్డి మరణించడంతో ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తాడూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుడు వస్పరి మల్లేష్ తండ్రి వస్పరి హుస్సేన్ మృతి చెందిన సందర్భంలో వారి నివాసానికి వెళ్లి కుటుంబాన్ని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, పార్టీ తరపున అన్ని విధాల సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.



# బత్తుల సత్యనారాయణకు ఘనంగా

# నివాళులర్పించిన విశ్వహిందూ పరిషత్ మంథని బృందం



మంథని//**మర్చి01(ఆకాంక్ష)** : మంథని పట్టణ విశ్వహిందూ పరిషత్ ప్రధాన కార్యదర్శి శ్రీ బత్తుల సత్యనారాయణకు విశ్వహిందూ పరిషత్ బృందం ఘనంగా నివాళు లర్పించారు. మంత్రపురి విశ్వహిందూ పరిషత్ బృందం మరియు హిందూ బంధువులు ఆదివారం మంథని పట్టణ అంబేద్కర్ చౌక్ లో శ్రీ బత్తుల సత్యనారాయణ యొక్క ఫోటో ఏర్పాటు చేసి హిందూ బంధువులందరి సమక్షంలో ఆయనకి ఘనంగా కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో విశ్వ హిందూపరిషత్ మంథని బృందం మరియు హిందూ బంధువులు అందరూ పాల్గొన్నారు.ం

# హోంగార్డు ద్విచక్ర వాహనంపై హరి శంకరుడి ఆగ్రహం..

## మీ ప్రత్యేక విభాగం శాఖకు ఏమైనా కొమ్ములు ఉన్నాయా...

## రామగుండం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో ట్రాఫిక్ ఎస్ఐ వీరంగం...

గోదావరిఖని//**మర్చి01(ఆకాంక్ష)** : పోలీస్ శాఖలోనే పని చేసే హోంగార్డు ద్విచక్ర వాహనాన్ని ట్రాఫిక్ ఎస్సై ధ్వంసం చేసిన ఘటన పెద్దపల్లి జిల్లాలో సంచలనంగా మారింది. రామగుండం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన శాఖ అంతటా చర్చనీయాంశమైంది. సొంత శాఖలో విధులు నిర్వహించే సిబ్బందికే పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాన్ని నిలుపుకునే హక్కు లేకపోవడం పై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే పెద్దపల్లిలోని ప్రత్యేక విభాగంలో గత నాలుగు నెలలుగా విధులు నిర్వహిస్తున్న హోంగార్డు బ్రహ్మచారి ఫిబ్రవరి 28న తన నివాసం నుండి ప్యాషన్ ప్లస్ ఏపీ 15పి 8613 అనే ద్విచక్ర వాహనంపై బయలుదేరి, ప్రతి రోజులాగే రామగుండం బస్టాండ్ సమీపంలో ఉన్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో తన వాహనాన్ని పార్కింగ్ చేసి విధుల నిమిత్తం పెద్దపల్లికి వెళ్లాడు. అయితే మరుసటి రోజు ఉదయం సుమారు 9 గంటల సమయంలో తిరిగి వచ్చి చూడగా తన వాహనం పూర్తిగా ధ్వంసమై ఉండడం చూసి షాక్‌కు గురయ్యాడు. తన వాహనం ఈ విధంగా ధ్వంసం కావడంపై హోంగార్డు బ్రహ్మచారి విచారణ చేయగా, అదే



ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్సై హరి శేఖర్ లాఠీతో వాహనాన్ని కొట్టి, టైర్లలో గాలి తీసి, అనంతరం కారుతో



గుద్ది పూర్తిగా పాడుచేశారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఘటనతో తీవ్ర మనస్తాపానికి గురైన బ్రహ్మచారి, ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌తో పాటు ఏసీబీ కార్యాలయంలోనూ ఎస్సైపై అధికారికంగా ఫిర్యాదు చేశాడు. సొంత శాఖలో పనిచేస్తున్న ఒక కింది స్థాయి హోంగార్డు తన వాహనాన్ని భద్రత కోసం పోలీస్ స్టేషన్ పరిధిలో నిలిపితే, అదే శాఖకు చెందిన ఒక ఎస్సై ఈ విధంగా వ్యవహరించడం దారుణమని పలువురు పోలీస్ సిబ్బంది మరియు స్థానికులు విమర్శిస్తున్నారు. పోలీస్ శాఖలో క్రమశిక్షణ, పరస్పర గౌరవం ఉండాల్సిన సమయంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై జిల్లావ్యాప్తంగా తీవ్ర చర్చ




జరుగుతోంది. ఎస్సై హరి శేఖర్ ప్రవర్తనపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారు. బాధిత హోంగార్డుకు న్యాయం జరుగుతుందా అనే అంశాలు ఇప్పుడు అందరిలో ఆసక్తి రేపుతున్నాయి. పోలీస్ శాఖ ప్రతిష్టను దెబ్బతీసే ఈ సంఘటనపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, పోలీస్ వర్గాలు కోరుతున్నాయి. ఈ సంఘటనపై సంబంధిత ఉన్నతాధికారులు ఇంకా అధికారికంగా స్పందించకపోవడం గమనార్హం. త్వరలోనే ఈ ఘటనపై పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని సమాచారం.

# పెద్దపల్లి జిల్లాలో ఎరుకల కుటుంబంపై అన్యాయం

## రామాలయం పేరిట గుడిసె కూల్చివేత యత్నం

## 40 ఏళ్లుగా నివసిస్తున్న కుటుంబాన్ని

## వెలివేయడంపై విమర్శలు...

## ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి రక్షణ

## కల్పించాలిడ రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి...



మంథనిరూరల్ //**మర్చి01(ఆకాంక్ష)** : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో గత 40 సంవత్సరాలుగా ఊరి బయట నివాసం ఉంటున్న ఎరుకల కుటుంబంపై జరుగుతున్న అన్యాయానికి ప్రజాసంఘాలు తీవ్రంగా స్పందించాయి. కేతిరి సారయ్య ఎల్లమ్మ కుటుంబాన్ని రామాలయం నిర్మాణం పేరుతో అక్కడి నుంచి వెళ్లగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, వెంటనే వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల రాష్ట్ర కన్వీనర్ బొప్పని పద్మ, రాష్ట్ర కన్వీనర్ అంబాల శారద, రాష్ట్ర కమిటీ సభ్యురాలు లోకిని స్వరూప, మొగులోజు శారదతో పాటు జిల్లా ప్రజాసంఘాల నాయకులు ఆ కుటుంబం నివసిస్తున్న స్థలాన్ని సందర్శించారు. నాయకులు మాట్లాడుతూ సుమారు నాలుగు దశాబ్దాల క్రితం అప్పటి గ్రామ సర్పంచ్ వెంకట్రావు తమ సొంత పనికి రాని నాలుగు గుంటల భూమిని ఈ కుటుంబానికి నివాసం కోసం ఇచ్చారని తెలిపారు. అప్పటి నుంచి ఆ నిరుపేద కుటుంబం గుడిసె కట్టుకుని పందులను పెంచుకుంటూ జీవనోపాధి పొందుతూ వస్తోందన్నారు. అయితే ఇటీవల కొందరు వ్యక్తులు రామాలయం నిర్మాణం పేరిట ఆ కుటుంబం అక్కడ ఉండకూడదని బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. గతంలో ఎవరూ లేని సమయంలో వారి గుడిసెను తగలబెట్టారని, ఆ ఘటనలో 30 పందులు సజీవ దహనం అయ్యాయని పేర్కొన్నారు. అయినప్పటికీ ఈ సంఘటనపై ఇప్పటివరకు బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని కొంతమంది పెత్తందారులు కలిసి ఆ కుటుంబాన్ని గ్రామం నుండి వెలివేయాలనే ఉద్దేశంతో వివక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కావున సంబంధిత రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి, ఎరుకల కుటుంబాన్ని వెలివేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఆ కుటుంబానికి గతంలో దానం ఇచ్చిన స్థలంలోనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి, ప్రభుత్వ పరంగా రక్షణ కల్పించాలని కోరారు. లేనిపక్షంలో అన్ని ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్, కేపీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మంథని లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ వయసుకే మనసుకు కాదు...

నాగర్ కర్నూల్ టౌన్//**మర్చి01(ఆకాంక్ష)** : ఏ ఉద్యోగి జీవితంలోనైనా నిర్ణీత వయసు వచ్చిన తర్వాత పదవీ విరమణ అనేది సహజ ప్రక్రియేనని, అది కేవలం వయస్సుకు మాత్రమే సంబంధించినదే కానీ వ్యక్తిత్వానికి, బాధ్యతలకు, సమాజ సేవకు ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకాదని వక్తలు పేర్కొన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో వైస్ ప్రిన్సిపాల్‌గా సేవలందించి పదవీ విరమణ పొందిన జోగులాంబ గద్వాల జిల్లా కుర్వపల్లి వాసి శ్రీ గురు జానకి రాములు గారి పదవీ విరమణ మహోత్సవం ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన నవోదయ విద్యాలయాల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది, రిటైర్డ్ సిబ్బంది, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, పిటిసి సభ్యులు, బాల్యమిత్రులు, క్లాస్‌మేట్లు, కాలేజీ మిత్రులు కుర్వపల్లి, కొరివిపాడు, గద్వాల, మహబూబ్‌నగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుండి వందలాదిమంది హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ శ్రీ జానకి రాములు మూడు దశాబ్దాలపాటు విద్యారంగానికి అందించిన సేవలను కొనియాడారు. ముఖ్యంగా భౌతిక శాస్త్రం పట్ల ఆయనకున్న నైపుణ్యంతో వేలాది మంది విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన ఘనత ఆయనకే దక్కుతుందని



అభినందించారు. వట్టెం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీ ప్రసాద్ ఆచార్యుల వేదమంత్రోచరణల మధ్య ఆశీర్వచనాలు అందించగా, దేవస్థానం మేనేజర్ శ్రీ చింతకింది శ్రీనివాసులు శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేసి సన్మానించారు. అనంతరం వట్టెం నవోదయ విద్యాలయ సిబ్బంది, కుటుంబ సభ్యులు జానకి రాములు దంపతులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు, బంధుమిత్రులు గజమాలలు, దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీ జానకి రాములు మాట్లాడుతూ తన



మూడు దశాబ్దాల ఉద్యోగ జీవితంలో ఎదుర్కొన్న అనుభవాలను, విద్యార్థుల్లో భౌతిక శాస్త్రం పట్ల ఆసక్తి పెంపొందించడానికి చేసిన కృషిని వివరించారు. విద్యార్థి దశ నుంచే పట్టుదల అలవర్చుకుంటే సాధించలేనిది ఏదీ లేదని, తమకు కఠినంగా అనిపించే విషయాలపైనే ఎక్కువ శ్రద్ధ పెట్టి సాధన చేస్తే నిష్ణాతులు కావడం సాధ్యమని విద్యార్థులకు సూచించారు. దాదాపు ఐదు గంటలపాటు సాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, స్మృతిచిహ్నాల ప్రదానం, సత్కారాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

# ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలో శ్రీనిధి....

## సిఐఎఫ్ నిధుల మంజూరుపై

## అనుమానాల మేఘం...

కొత్తగూడెం//**మర్చి01(ఆకాంక్ష)** : ఖమ్మం జిల్లా కారేపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలకు మంజూరైన శ్రీనిధి నిధులు, మండల సమైక్య నిధులు (సిఐఎఫ్) మంజూరులో అవకతవకలు జరిగి ఉండవచ్చన్న ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. మోట్లగూడెం, పేరుపెల్లి, మాదారం, కారేపల్లి, విశ్వనాథపల్లి, రేలకయలపల్లి, చీమలపాడు, పాటి మీదగుంపు గ్రామాల్లో కోట్ల రూపాయల లావాదేవీల్లో పారదర్శకత లోపించిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్వయం సహాయక సంఘాల ఎంపిక, లబ్ధిదారుల నిర్ణయం, నిధుల విడుదల విధానం వంటి అంశాల్లో నిబంధనలు పూర్తిగా పాటించలేదని కొన్ని వర్గాలు ఆరోపిస్తున్నాయి. సమైక్య సిఐఎఫ్ నిధుల మంజూరులో గ్రామస్థాయి వసూళ్లు తప్పనిసరిగా తీసుకున్నారని, కొన్ని సంఘాలకు సంబంధించిన బ్యాంకు ఖాతాల వివరాలు సభ్యులకు అందుబాటులో లేవని, సమావేశాల నమోదుపై స్పష్టత లేదని స్థానికులు పేర్కొంటున్నారు. శ్రీనిధి నిధులతో పాటు సిఐఎఫ్ మంజూరుల విషయంలో సరైన ప్రమాణాలు అనుసరించలేదన్న విమర్శలు ఇటీవల వరుసగా వెలువడుతున్నప్పటికీ సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి స్పష్టమైన ప్రకటన రాకపోవడం చర్చనీయాంశమైంది. ఫిర్యాదులు అందాయా? ప్రాథమిక విచారణ చేపట్టారా? ఆడిట్‌కు ఆదేశాలున్నాయా? అన్న ప్రశ్నలకు సమాధానాలు వెల్లడి కావడం




లేదు. ఈ నేపథ్యంలో కిందిస్థాయి సిబ్బంది గ్రామాల్లో మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. ప్రజల నిధుల విషయంలో పూర్తి పారదర్శకత అవసరమని గ్రామస్తులు కోరుతున్నారు. శ్రీనిధిసిఐఎఫ్ మంజూరులపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు బహిర్గతం చేయాలని, అవసరమైతే ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించి ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.